జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శుక్రవారం 6 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :292 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 ; సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 ; చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com





తిరుమల లడ్డూ కేసు..

ఏపీ వెలుపలకు బదిలీకి సుప్రీం నో!

- విచారణ మరో రాష్ట్రానికి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- సిట్ దర్యాప్తు కొనసాగుతున్నందున జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ
- సాక్షులు, ఆధారాలన్నీ ఏపీలోనే ఉన్నాయన్న ధర్మాసనం

న్యూఢిల్లీ

తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు ట్రయల్ విచారణను ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. విచారణను ఏపీ వెలుపలకు మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మహారాష్ట్రకు చెందిన మాల్‌గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మచింద్ర శాంతారామ్ - మిగతా3లో

చైర్‌పర్సన్లుగా కొత్త ముఖాలు

- సామాన్యులకు మున్సిపల్ పీఠాలు..
- కూటమి కొత్త ప్రయోగం!
- ట్యాక్సీ డ్రైవర్ నుంచి నర్సు వరకు..
- గృహిణులు, వైద్యులు, సాధారణ కుటుంబాల వారికి అవకాశం
- రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేకున్నా ప్రజా మద్దతుతో విజయం



అమరావతి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో పాటు, పలు పట్టణాల్లో సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులకు చైర్‌పర్సన్ పదవులు దక్కడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ వారసత్వం, అంగబలం, ఆర్థిక స్థోమత ఉన్నవారికే పదవులు దక్కుతాయనే అభిప్రాయానికి భిన్నంగా, సాధారణ వృత్తుల్లో ఉన్నవారికి కూటమి పార్టీలు అవకాశం కల్పించాయి. ట్యాక్సీ డ్రైవర్లు, నర్సులు, వైద్యులు, గృహిణుల కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులు మున్సిపల్ పీఠాలను అధిష్ఠించారు. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే ఆర్థిక స్థోమత లేకపోయినా ప్రజల మద్దతుతో విజయం సాధించడం విశేషం. పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మేకల - మిగతా3లో



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

- గోకుల్ డెయిరీ వివాదంపై రాహుల్ విమర్శలు
- ఎన్నికల తర్వాత నిబంధనలు మార్చిందని ఆరోపణ
- 25 స్థానాల్లో కాంగ్రెస్ ప్యానెల్‌కు 13 సీట్లు
- బోర్డులో నామినేటెడ్ సభ్యుల నియామకంపై వివాదం
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న పవన్ ఖేడా



ధైర్యముంటే ప్రధానికి లేఖ రాయండి

- రాహుల్‌కు అమిత్ షా సవాల్..
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సిద్ధమని ప్రకటన
- ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధమని వెల్లడి
- చొరబాటుదారుల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్‌కు ప్రశ్న
- పార్లమెంట్‌ను అడ్డుకుంటున్నారంటూ విమర్శలు
- ఓటర్ల జాబితా సవరణను సమర్థించిన సీఎం సైనీ

పారా క్రీడల్లో భారత్ పతకాల ప్రభంజనం!

- 14 నుంచి 114కు.. పారా అథ్లెట్ల సత్తా!
- మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు
- ఆసియా పారా గేమ్స్‌లో భారత క్రీడాకారుల ఘనత
- 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు
- ఐదు ప్రపంచ రికార్డులు.. తొమ్మిది ఆసియా రికార్డులు
- మహిళా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రధాని ప్రశంసలు



ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో

ఓటర్ల జాబితా సవరణ

- యువ ఓటర్ల నమోదుకు ఈసీ కీలక నిర్ణయం
- నవంబర్ 30న ముసాయిదా జాబితా ప్రచురణ
- 2027 జనవరి 21న తుది ఓటర్ల జాబితా
- ఆధార్ సమర్పణ స్వచ్ఛందమేనని స్పష్టీకరణ
- ఓట్ల తొలగింపుపై క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి





నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

- చంద్రబాబు గెలిచి ఓడారు.. మేం ఓడి గెలిచాం!
- స్థానిక ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్ జగన్ ఆరోపణలు
- పోలింగ్ శాతాల పెరుగుదలపై అనుమానాలు.. బ్యాలెట్ బాక్సులపైనా ప్రశ్నలు
- తుపాన్ల నష్టంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ

తాడేపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. - మిగతా3లో

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



- ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం
- 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం
- నేడు రీపోలింగ్.. 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- 40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి - మిగతా3లో

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

- నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో వందే భారత్ రైళ్లకు భారీ స్పందన
- తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో 189% రికార్డు స్థాయి ఆక్యుపెన్సీ
- తొలి వందే భారత్ స్లీపర్‌కు కూడా 114% పైగా ఆక్యుపెన్సీ నమోదు



కొరియాలో ఒడిశా పోలీసుల

ఆగడాలు సహించం!

- గిరిజనుల ఓటు హక్కును అడ్డుకోవద్దు.. మంత్రి సంధ్యారాణి హెచ్చరిక
- 29 గ్రామాల్లో బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారని ఆరోపణ
- సరిహద్దును భారత్-పాక్ సరిహద్దులా మార్చొద్దని హితవు



కొరియా

ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొరియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళుతున్న గిరిజనులను ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కొరియా గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఒడిశా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరియాలోని 29 గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల - మిగతా3లో

విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా నిబంధనల్లో సడలింపు

- పాక్ పౌరులు, మైనార్టీ శరణార్థులకు ఊరట..
- శ్రీలంక తమిళులు, టిబెటన్లకూ మినహాయింపులు
- కేరళలో స్థిరపడిన వారికి మరో మినహాయింపు
- భారత మూలాలున్న మలేసియా, సింగపూర్ పౌరులకూ



గోస్పాడు మండలంలో భూమా జగత్ విఖ్యాతి రెడ్డి హల్‌చల్



నంద్యాల:గోస్పాడు=05 ప్రజాజ్యోతి ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల వేళ భారీ కాన్వాయ్‌తో పర్యటన ఎన్నికల నిబంధనలు వైసీపీ నాయకులకేనా పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన టీడీపీ నాయకులకు నిబంధనలు వర్తించవా భారీ కాన్వాయ్‌కు అనుమతులు ఉన్నాయా.. లేక అధికారుల అండదండలు ఉన్నాయా ఎన్నికల కోడ్ అమలులో అధికారుల ద్వంద్వ వైఖరిపై ఓటర్ల ఆగ్రహం నిబంధనలు ఉల్లంఘిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు ఎన్నికల యంత్రాంగం నిద్రావస్థలో ఉందా అధికార పార్టీ నేతలకో న్యాయం..ప్రతిపక్ష నేతలకో న్యాయమా ఎన్నికల సంఘం ఆదేశాలు గోస్పాడులో అమలవుతున్నాయా భారీ కాన్వాయ్ వ్యవహారంపై అధికారులు బహిరంగంగా వివరణ ఇవ్వాలి.రాజకీయాలకు అతీతంగా ఎన్నికల నియమావళిని అమలు చేయాలని ఓటర్ల డిమాండ్

మహానంది మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ

నంద్యాల:నవంబర్=05 ప్రజాజ్యోతి 5 వతేదిన జరిగిన జడ్పీటీసీ/ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ మహానంది మండలంలోని బుక్కాపురం, మహానంది, అల్లినగరం, గోపవరం, సీతారామపురం, మసీదుపురం తదితర పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.





ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఎవరూ నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేరుకునేంత వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ఆలమూరు, గుమ్మిలేరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, ఐఏఎస్ పుప్పాల ప్రశాంతి.



ఆలమూరు నవంబర్ 5(ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, ఐఏఎస్ పుప్పాల ప్రశాంతి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని ఆలమూరు, గుమ్మిలేరుతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను, పోలింగ్ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఎన్నికల సామగ్రి వినియోగం, ఎన్నికల నియమావళి అమలు తీరును పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, అమల్లో ఉన్న ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమాన్ని ఆలమూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీ ప్రత్యూష, తహసీల్దార్ కె. కుశరాజు, ఎంపీడీవో ఏ. రాజు, ఎంఈవోలు అప్పాజీ, రాజు తదితర అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు.

పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె:నవంబర్= 05 ప్రజాజ్యోతి నంద్యాల జిల్లా లో పలువివాహ కార్యక్రమా లకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి న బనగాన పల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైఎస్ఆర్సి పి కన్వీనర్ కాటసాని తిరు పాల్ రెడ్డి



ప్రతి ఫౌరుడు బాధ్యతగా ఓటు వేయండి.





ఓటు హక్కు వినియోగించుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల:నవంబర్=05 ప్రజాజ్యోతి భారత ప్రజాస్వామ్యంకు పునాది ఓటు అని, ప్రతి ఓటరు భాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. గురువారం నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం, పగిడ్యాల మండలం తన సొంత గ్రామం ముచ్చుమరి పోలింగ్ బూత్ వద్ద ఓటర్లతో కలిసి క్యూలో నిలిచి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎంతో విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ వైసీపీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయడంపై మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



నంద్యాల:నవంబర్=05 ప్రజాజ్యోతి తనపై ఎలాంటి కేసులు లేకపోయినా పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందనే భయంతోనే టీడీపీ నాయకులు వైసీపీ నేతలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల రోజున వైసీపీ నాయకులను హౌస్ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి ఆంక్షలు విధించలేదని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.వైసీపీ నాయకుల అరెస్ట్ ల పై మా నాయకుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి తో చర్చించి ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేస్తామని సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

మడికి గ్రామంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నదియా ఐఏఎస్.



ఆలమూరు నవంబర్ 5(ప్రజాజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని మడికి గ్రామంలో గురువారం నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ నదియా ఐఏఎస్ వారు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును, ఓటింగ్ సరళిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పనితీరును ఆమె సమీక్షించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కొత్తపేట ఆర్డీఓ జి. సత్యనారాయణ, ఆలమూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీ ప్రత్యూష, తహసీల్దార్ కె. కుశరాజు, ఎంపీడీవో ఏ. రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- ఇంతటి అభిమానం ఊహించలేదు
- టిడిపి దేవనకొండ జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ సాధిక

దేవనకొండ : ప్రజా జ్యోతి న్యూస్(ఎ. జ. రాఘవేంద్ర 05-10-2026: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ దేవనకొండ జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా గత పది రోజులుగా మండలంలోని 44 గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించానని, ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు నన్ను ఆధరించి, చూపించిన అభిమానాన్ని మరిచిపోలేను అన్నారు. ప్రచారంలో తమ వెంట వచ్చిన టిడిపి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు, తనను ఆదరించిన ప్రజలకు మరియు ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తమ మామ, టిడిపి సీనియర్ నాయకులు ఈదుల దేవరబండ సుబాన్ తో పాటు తనపై ఇంతటి అభిమానం చూపడం ఊహించలేదని, మండల ప్రజలను మరువలేని చెప్పారు. టిడిపి అధినేత, సీఎం చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ గారు, టిడిపి ఆలూరు ఇన్చార్జి వైకుంఠం జ్యోతి మేడం గారి ఆశీస్సుల తోనే తనకు దేవనకొండ జడ్పిటిసి గా పోటీ చేసే అవకాశం దక్కిందని, ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన తమ పార్టీ

ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



బనగానపల్లె , నవంబర్ 5 ప్రజాజ్యోతి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జర్నలిస్టులో ఘనంగా నిర్వహించారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎపిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులుజి. మద్దయ్య యాదవ్, బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో జర్నలిస్టులు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ20 సంవత్సరాల నుండి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు జర్నలిస్టుల హక్కుల కోసం, సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎం రామచంద్రా రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ సుబ్రహ్మణ్యం, బనగానపల్లె మండల గౌరవ అధ్యక్షులు ఎం రఘురామిరెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బాల చెన్నయ్య, మండల కార్యదర్శి సూర్య రాజేష్ ,నాయకులు వెంకట రాముడు, ఆర్.టి. వి ఓబులేసు, నగేష్ రమణ గౌడ్ కుమారస్వామి, సీమ రత్నం బి.సాదక్ భాష, జనగలం రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు

మృతదేహానికి నివాళులు అర్పించిన కాటసాని రామిరెడ్డి



కోవెలకుంట్ల:నవంబర్=05 ప్రజాజ్యోతి బనగానపల్లె నియోజకవర్గం లోని కోవెలకుంట్ల పట్టణం రంగరాజు పేట ఎత్తపు చంద్ర శేఖర్ రెడ్డి (వయసు 67 సంవత్సరాలు) అనారోగ్యం తో మృతి చెందడం జరిగింది వారి స్వగృహానికి వెళ్లి మృత దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈకార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, చిక్కెప్లలి ప్రసాద్ రెడ్డి,అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు

హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్.



ఆలమూరు, నవంబర్ 5(ప్రజాజ్యోతి):డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ గురువారం ఆలమూరు మండలంలోని హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆలమూరు ఎస్సై జి. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తతను జిల్లా ఎస్పీ సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఓటర్లు ఎలాంటి ఒత్తిడికి, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లా ఎస్పీ వెంట ఆలమూరు ఎస్సై జి. నరేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.





నేతలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వారి ఆశయ సాధన కోసం, ప్రజా సంక్షేమం కోసం, పల్లెల అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తాను గోనెగండ్ల జిల్లా పరిషత్ హై స్కూల్ లో తన ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.

నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

-మొదటిపేజీ తరువాయి

పోలింగ్ శాతాలను రాత్రికి రాత్రే పెంచి చూపించి గెలుపును తమ ఖాతాలో వేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు గెలిచినా నైతికంగా ఓడిపోయారని, తాము ఓడినా ప్రజల తరఫున పోరాడి గెలిచామని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే టీడీపీ గెలిచేదా? అని ప్రశ్నించారు.

పోలింగ్ శాతాల పెరుగుదలపై ప్రశ్నలు

విశాఖపట్నంలో రాత్రికి రాత్రే 1,15,887 ఓట్లు ఎలా పెరిగాయని జగన్ ప్రశ్నించారు. సోమవారం ఉదయానికి పోలైన ఓట్ల సంఖ్య 1,35,154కు ఎలా చేరిందని నిలదీశారు. రాత్రి 51.46 శాతంగా ఉన్న పోలింగ్ మరుసటి ఉదయానికి 56.03 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. చీమకుర్తిలో రాత్రి 11 గంటలకు 78.28 శాతంగా ఉన్న పోలింగ్ అర్ధరాత్రి 12 గంటలకు 84.36 శాతానికి ఎలా చేరిందని అన్నారు. జమ్మలమడుగులో ఉదయం 11 గంటలకే 60 శాతం పోలింగ్ ఎలా నమోదైందని, అద్దంకిలో ఉదయం 11 గంటలకు 19 శాతంగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు 56 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ధర్మవరంలో రెండు గంటల్లో 8 శాతం నుంచి 36.36 శాతానికి, పార్వతీపురంలో 12 శాతం నుంచి 44 శాతానికి పోలింగ్ ఎలా పెరిగిందని నిలదీశారు.

నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. నామినేషన్లు, స్క్రూటినీ, పోలింగ్



బూత్‌లు, పోలింగ్ శాతాలు, బ్యాలెట్ బాక్సులు, చివరకు ఫలితాల ప్రకటనలోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన బ్యాలెట్ బాక్సులకు సైతం సీళ్లు వేయలేదని ఆరోపించారు. తమ అభ్యర్థులు గెలిచిన చోట్ల కూడా ఫలితాలను తారుమారు చేశారని ధ్వజమెత్తారు. యువతరానికి సైతం రిగ్గింగ్, పోలింగ్ అక్రమాలపై శిక్షణ ఇస్తున్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

'ఏపీ ఫర్ సేల్‌గా మారింది'

చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ అమ్మకానికి పెట్టినట్లుగా మారిందని జగన్ విమర్శించారు. ప్రభుత్వ భూములను 99 పైసలకే కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం, గంజాయి సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. రాజధాని సహా పలు రంగాల్లో అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఏపీని 'సౌత్ బిహార్'తో పోలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యకర్తల పోరాటానికి సెల్యూట్

ప్రజల తరఫున తమ పార్టీ బలంగా గొంతు వినిపించిందని జగన్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను దేశం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా పోరాడారని ప్రశంసించారు. వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు.

తుపాన్ల నష్టంపై ప్రభుత్వాన్ని నిలదీత

మురసు తుపాను ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికలను వాయిదా వేయలేదని జగన్ విమర్శించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. అర్నల్ తుపాను కారణంగా పది మందికి పైగా మరణించారని, 150 గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని ఆరోపించారు. మురసు తుపాను కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన సాయం అందించలేదని విమర్శించారు. 13 నెలల క్రితం వచ్చిన మోంథా తుపాను నష్టపరిహారానికి సంబంధించి జీవోలు జారీ చేసినప్పటికీ, బాధితులకు నగదు అందలేదని జగన్ ఆరోపించారు.

చైర్‌పర్సన్లుగా కొత్త ముఖాలు

-మొదటిపేజీ తరువాయి

ఈశ్వర్ ట్యాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న ఆయనకు ఈ ఎన్నికల్లో పార్టీ అవకాశం కల్పించింది. ఎన్నికల ఖర్చులు భరించడం కూడా ఆయనకు సవాలుగా మారింది. కొన్ని ఖర్చుల కోసం అప్పులు చేయగా, మరికొందరు ఆర్థికంగా సహకరించారు. చివరకు ఓటర్ల మద్దతుతో పుట్టపర్తి ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ భార్యకు అవకాశం

ఏలేశ్వరం ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన యార్లగడ్డ అక్షితది సాధారణ కుటుంబం. ఆమె భర్త ప్రభుత్వ ఆసుపత్రిలో పార్ట్‌టైమ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినా టీడీపీ ఆమెకు అవకాశం కల్పించింది. ప్రజల మద్దతుతో అక్షిత విజయం సాధించి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

నర్సు నుంచి మున్సిపల్ పీఠానికి

నిడదవోలు ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన మురాల జ్యోతి గతంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేశారు. ఆమె భర్త ట్రైల్స్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. ఈ స్థానం రిజర్వేషన్ మార్పుతో ఎస్సీ మహిళకు కేటాయించడంతో జ్యోతికి పోటీ చేసే అవకాశం లభించింది. జనసేన ఆమెకు టికెట్ ఇవ్వగా, ఎన్నికల్లో విజయం సాధించి ఛైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

సామాజిక సేవకు గుర్తింపుగా..

తుని ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఎస్.శ్రీలత సాధారణ గృహిణి.



ఆమె భర్త ప్రసాద్ సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తూ స్థానికంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీసీ మహిళకు రిజర్వు అయిన ఈ స్థానంలో జనసేన శ్రీలతకు అవకాశం కల్పించింది. ఆర్థికంగా పెద్దగా అందదండలు లేకపోయినా పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారు.

గృహిణులకు రాజకీయ అవకాశం

ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన కన్నెగంటి అమూల్యకు రాజకీయ నేపథ్యం లేదు. బీటెక్ చదివిన ఆమె గృహిణిగా ఉంటున్నారు. ఆమె భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, తండ్రి వీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగి. టీడీపీ ఆమెకు అవకాశం కల్పించడంతో ఎన్నికల్లో విజయం సాధించారు. కడప జిల్లా ఎర్రగుంట్ల ఛైర్‌పర్సన్‌గా బీజేపీ తరఫున మధులత ఎన్నికయ్యారు. ఆమె భర్త ప్రైవేటు ఉద్యోగి. ఈ కుటుంబానికీ రాజకీయ నేపథ్యం లేదు.

వైద్యులకూ దక్కిన పీఠాలు

మున్సిపల్ ఎన్నికల్లో వైద్యులు కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. నంద్యాల మున్సిపల్ ఛైర్మన్‌గా పిల్లల వైద్యుడు బాబన్ ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ షేక్ నీలోఫర్ విజయం సాధించారు. ఆమె కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినా, భార్యాభర్తలిద్దరూ స్థానికంగా వైద్యులుగా సేవలందిస్తున్నారు. ఇలా వివిధ వృత్తుల్లో ఉన్నవారికి మున్సిపల్ పీఠాలు దక్కడంతో స్థానిక రాజకీయాల్లో కొత్త ముఖాలకు ప్రాధాన్యం లభించినట్లయింది.

ఆ ఐదే... సక్సెస్ ఫార్ములా...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల సమరంలో టీడీపీ–జనసేన–బీజేపీల ఎన్డీయే కూటమి తిరుగులేని ప్రభంజనాన్ని సృష్టించింది. కార్పొరేషన్లు మొదలుకుని నగర పంచాయతీల వరకు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయాలను నమోదు చేశారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అతి కష్టం మీద కేవలం మూడు మున్సిపల్ చైర్మన్ పీఠాలకే పరిమితమై అస్తిత్వ సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా అధికారం మారిన కొత్తలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా ముగుస్తాయన్నది నాణేనికి ఒక వైపే, కానీ క్షేత్రస్థాయిలో కూటమి సాధించిన ఈ అపూర్వ స్వీప్‌కు కేవలం అధికార బలమే కారణం కాదు. పకడ్బందీ వ్యూహం, బలమైన ఐక్యత, ప్రజామోదం కలగలసిన ఐదు ప్రధాన అంశాలే కూటమి విజయ ధంకా మోగించడానికి దారితీశాయి.కూటమి విజయానికి ప్రథమ, ప్రధాన పునాది మూడు పార్టీల మధ్య ఉన్న తిరుగులేని ఐక్యత. సార్వత్రిక ఎన్నికల నాటి కలయిక కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే కాదని, అది ఒక బలమైన భావజాల బంధమని మరోసారి రుజువైంది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా విపక్ష శ్రేణులు తీవ్రస్థాయిలో విష ప్రచారం సాగించాయి. జనసేన ఓటర్లు అసంతృప్తితో ఉన్నారని, ఆ ఓట్లు వైసీపీ వైపు మళ్లుతున్నాయంటూ పక్కా ప్లాన్‌తో రెచ్చగొట్టే యత్నాలు జరిగాయి. అయితే, కూటమి అగ్రనేతలు, క్షేత్రస్థాయి కేడర్ ఈ మైండ్ గేమ్‌ను, కుట్రలను ఇట్టే పసిగట్టారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ ఎలాంటి గందరగోళం లేకుండా నూటికి నూరు శాతం సాఫీగా జరిగిపోయింది. విపక్ష కుతంత్రాలు బెడిసికొట్టి, కూటమి బంధం మరింత పటిష్టమవడానికి ఈ ఎన్నికలు దోహదపడ్డాయి.పాత మూస రాజకీయాలకు స్వస్తి పలుకుతూ అభ్యర్థుల ఎంపికలో కూటమి ప్రదర్శించిన సాహసోపేత నిర్ణయాలు పట్టణ ఓటర్లను విశేషంగా ఆకర్షించాయి. దశాబ్దాలుగా పాతుకుపోయిన వారసత్వ, సంప్రదాయ నేతలకే పరిమితం కాకుండా.. జెన్–జీ తరంతో పాటు సాధారణ మధ్యతరగతి విద్యావంతులైన యువతీయువకులకు భారీగా టిక్కెట్లు కేటాయించారు. కార్పొరేషన్లు, మున్సిపల్ వార్డుల్లో కొత్త ముఖాలు, ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న యువ అభ్యర్థులు బరిలోకి దిగడంతో సహజంగానే పట్టణ ప్రాంతాల్లోని యూత్, విద్యావంతులైన ఓటర్లు కూటమి



అభ్యర్థుల వైపు ఏకపక్షంగా మొగ్గు చూపారు. ఈ వ్యూహాత్మక మార్పు క్లీన్‌స్వీప్‌కు బలమైన చోదకశక్తిగా మారింది.పొత్తుల రాజకీయాల్లో స్థానిక స్థాయిలో సీట్ల సర్దుబాటు ఎప్పుడూ అత్యంత క్లిష్టమైన అంశమే. ఈ ఎన్నికల్లోనూ పలు డివిజన్లు, వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య ఆశావహుల తీవ్ర పోటీ, అసంతృప్తులు తలెత్తిన మాట వాస్తవమే. అయితే, ఏ ఒక్క నాయకుడూ వ్యక్తిగత విభేదాలతో తమ పార్టీల ఉమ్మడి ప్రయోజనాలకు గండి కొట్టే ప్రయత్నం చేయలేదు. సీనియర్ నాయకత్వం సకాలంలో జోక్యం చేసుకుని సమన్వయ కమిటీల ద్వారా అసమ్మతులను చల్లార్చడం, కేడర్ అంతా కూటమి విజయమే అంతిమ లక్ష్యంగా భావించి సమష్టిగా పనిచేయడం వల్ల ఎక్కడా క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం లేకుండా పోయింది. క్రమశిక్షణతో కూడిన ఈ సమన్వయం కూటమి ఓటు బ్యాంకును ఒక్కతాటిపై నిలిపింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గత ఐదేళ్ల పాలనలో కనిపించిన అరాచక సంస్కృతి, కక్షసాధింపులు, ఫ్యాక్షన్ భయాలు తొలిగిపోయి.. ప్రజలకు అసలైన మనశ్శాంతి లభించింది. ఎటువంటి రాజకీయ వేధింపులు లేని ప్రశాంత వాతావరణం, సుపరిపాలన ప్రజల్లో నమ్మకాన్ని నింపాయి. దీనికి తోడు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణ, అమరావతి రాజధాని పనులు, నగరాల్లో మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకోవడంతో.. కూటమి పాలనతోనే నగరాలకు భవిష్యత్తు అన్న బలమైన సంకేతం పట్టణ ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఈ ప్రశాంతతకే ఓటర్లు బ్యాలెట్ బాక్సుల ద్వారా జై కొట్టారు.కూటమి బలాలకు తోడుగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించిన నైరాశ్యం, పూర్తి చేతకానితనం కూటమి పనిని మరింత సులువు చేసింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత ఆ పార్టీ అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి శ్రేణుల వరకు ఆత్మవిశ్వాసం పూర్తిగా అడుగంటింది. అనేక చోట్ల అసలు ఎన్నికల్లో పోటీ చేయడమే గొప్ప అన్నట్లుగా నిస్తేజంగా వ్యవహరించారు. ఎలాగూ ఓడిపోతాం.. పోటీ నామమాత్రంగా చేస్తే చాలు అన్నట్లుగా అభ్యర్థులు చేతులెత్తేయడం, అధిష్టానం నుంచి సరైన ఆర్థిక, సంస్థాగత సహాయం అందకపోవడం వైసీపీ కొంపముంచింది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి లేక, కేవలం సోషల్ మీడియాకే పరిమితమైన వైసీపీ వైఫల్యం.. కూటమికి సంపూర్ణ విజయానికి తివాచీ పరిచింది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-మొదటిపేజీ తరువాయి

ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా చాలా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.

2.61 కోట్ల మంది ఓటర్లు

రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాల్లో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జడ్పీటీసీ స్థానాలకు 2,169 మంది, ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. రాష్ట్రంలో మొత్తం 2,61,52,377 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు.

మూడు గంటల వరకు 58.55 శాతం

మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు.

పలు చోట్ల ఉద్రిక్తతలు

పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనలతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పటిష్ఠం చేశారు. పోలింగ్ ప్రక్రియకు పెద్దగా అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా సిబ్బందిని నియమించారు. సుమారు 2.52 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. 40,679 మంది పోలీసులను భద్రతా విధులకు వినియోగించారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా, వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, పోలీసు భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

రేపు రీపోలింగ్.. 7న కౌంటింగ్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏవైనా కేంద్రాల్లో రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో 9,062 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల అనంతరం ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. దీంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు దిశగా తదుపరి ఘట్టం ప్రారంభం కానుంది.

తిరుమల లడ్డూ కేసు..
ఏపీ వెలుపలకు బదిలీకి సుప్రీం నో!

-మొదటిపేజీ తరువాయి

లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన ఈ కేసులో నిందితుడిగా ఉన్నారు.

పిటిషనర్ వాదనతో విభేదించిన ధర్మాసనం

ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో రాజకీయ నాయకులు ఈ కేసుపై తరచూ ప్రకటనలు చేస్తున్నారని, దీనివల్ల స్వేచ్ఛాయుత విచారణకు ప్రతికూల వాతావరణం ఏర్పడుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అందువల్ల ట్రయల్ విచారణను ఏపీ వెలుపల నిర్వహించాలని కోరారు.

సిట్ దర్యాప్తును గుర్తుచేసిన సుప్రీం

పిటిషనర్ వాదనలతో ధర్మాసనం విభేదించింది. సుప్రీంకోర్టు స్వయంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేస్తున్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ కేసుపై రాజకీయ నాయకులు బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని గతంలోనే ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొంది. అంతేకాకుండా కేసుకు సంబంధించిన చాలామంది సాక్షులు, సాక్ష్యాధారాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బదిలీకి నిరాకరణ.. పిటిషన్ డిస్మిస్

ఈ పరిస్థితుల్లో ట్రయల్ విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. విచారణ బదిలీ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేస్తూ మచింద్ర శాంతారామ్ లంకే దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసు విచారణ ఏపీలోనే కొనసాగనుంది.

కొరియాలో ఒడిశా పోలీసుల ఆగడాలు సహించం!



-మొదటిపేజీ తరువాయి

ఆగడాలు మితిమీరిపోయాయని మంత్రి సంధ్యారాణి ఆరోపించారు. గిరిజనులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, చివరకు కిడ్నాప్‌లకు కూడా దిగడం దారుణమని విమర్శించారు. ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలి తప్ప, అమాయక గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు.

ఓటు హక్కును అడ్డుకునే అధికారం లేదు

గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దును భారత్–పాకిస్థాన్ సరిహద్దులా మార్చవద్దని హెచ్చరించారు. సరిహద్దు గ్రామాల ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించకుండా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు.

కొరియాపై సీఎం ప్రత్యేక దృష్టి

కొఠియా గ్రామాల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని సంధ్యారాణి తెలిపారు. మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గం,రుద్రవరం మండలం,పెద్ద కంబాలూరు లో ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్న సిరివెళ్ల సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని,పోలింగ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించిన సిపిఐ నేతలు

సిరివెళ్ల సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఖాకి విడిచి పసుపు చొక్కా వేసుకో



నంద్యాల రుద్రవరం=05 ప్రజాజ్యోతి నామినేషన్లు ప్రారంభమైనప్పటి నుండి విత్ డ్రా చేసుకోవాలని సిపిఐ నాయకులను బెదిరిస్తూ, నేడు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓట్లు వేయడానికి వెళ్లకుండా సిపిఐ నాయకులను అడ్డుకుంటున్న సిరివెళ్ల సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలి అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న సిరివెళ్ల సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలి పెద్ద కంబాలూరులో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నాడు సిపిఐ నాయకులను ఓటు వేయడానికి వెళ్లకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు అసలు నంద్యాల జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఉన్నారా బంగ్లాలో నిద్రపోతున్నారా అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఏకగ్రీవం చేసుకుంటే ప్రజా సమస్యల కోసం పోరాటం చేసే సిపిఐ పోటీలో ఉండకూడదా? ఎన్నికలు ప్రారంభం అయినా కొంత సమయానికే రుద్రవరం మండలంలో పెద్ద కంబాలూరు లో సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి వీరంగం సిపిఐ నాయకులను ఓటర్లను బెదిరిస్తున్న సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి

పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు



నంద్యాల:నవంబర్=05 ప్రజాజ్యోతి జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డిని పోలీసులు ఎక్కడికి అక్కడ అడ్డుకుంటున్నారు. ఓటింగ్కు కేవలం అరగంట సమయం మాత్రమే ఉండగా టిడిపి నాయకులు రౌడీలతో గుండాలతో రిగ్గింగ్ చేసుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నారని, కుట్రలు పన్నుతున్నారని శిల్ప చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్ద భయభ్రాంతులకు గురి చేయడం దారుణమైన చర్యలని తెలిపారు. పోలీసులు కేవలం వైసీపీ నాయకులను మాత్రమే అడ్డుకుంటున్నారని టిడిపి వారు గెలవలేక ఓటమి భయంతో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి శిల్ప చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. ఉదయం నుండి వైసీపీ నేతలు అందరిని హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధం చేయడం , టిడిపి నేతలను యదేచ్ఛగా వదిలిపెట్టడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలని తెలిపారు

అల్లూరు గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాండ్ర శివానందరెడ్డి దంపతులు

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకం..

పతి ఒక్కరూ ఓటు వేయాలి: మాండ్ర శివానందరెడ్డి



ప్రజా జ్యోతి నందికొట్కూరు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో నందికొట్కూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర ఉమాదేవి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అల్లూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ వంటివని, ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం ఈ ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ముచ్చుమర్రి గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం..

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలి



ప్రజా జ్యోతి నందికొట్కూరు ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ఎంతో కీలకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. ముచ్చుమర్రి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల పోలింగ్లో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేశారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ఎంతో విలువ ఉంటుందని, ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే గొప్ప అవకాశం ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడిపై ఉన్న సామాజిక బాధ్యత అని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఓటు హక్కును వినియోగించుకోవడంతో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

కేవీకే బనవాసిని సందర్శించిన విద్యార్థులు.



ఎమ్మిగనూరు, నవంబర్05(ప్రజా జ్యోతి):మండల పరిధిలో ని బనవాసిలో గ్లోబల్ జీనియస్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగం 40 మంది విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) బనవాసిని సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్ర చౌదరి కేంద్రం విధులు, లక్ష్యాలు, రైతులకు అందిస్తున్న శిక్షణ, సాంకేతిక సేవలను వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి. శ్రీధర్ మాట్లాడుతూ బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ అగ్రికల్చర్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురై మృతి చెందిన భాష కుటుంబానికి 8, వేల రూపాయలు ఆర్థిక సహాయం



ఎమ్మిగనూరు, నవంబర్ 5(ప్రజా జ్యోతి): పట్టణంలోని 32 వ వార్డులో రేడియం స్టిక్కర్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న భాష ప్రమాదవశత్తు కిందపడి తలకు తీవ్ర గాయాల య్యాయి చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మృతి చెందారు విషయం తెలుసుకున్న 32 వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కౌన్సిలర్ అభ్యర్థి ఎరుకల పరమేశు, బోయ బుజ్జి అలీ, బోయ ఉరుకుందు, భాష పార్థివ దేహాన్ని సందర్శించి అంత్యక్రియల నిమిత్తం ఎనిమిది వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు అనంతరం భాష మృతి దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో పోలింగ్ ఏర్పాట్లపై ఆరా



వేటపాలెం నవంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. గురువారం చీరాల, వేటపాలెం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చీరాల మండలంలోని పుల్లాయపాలెం, దేవినూతల గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు వేటపాలెం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును, ఓటర్ల హాజరును, ఇప్పటివరకు నమోదైన పోలింగ్ శాతాన్ని సంబంధిత పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఓటర్లు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ పర్యటనలో చీరాల మండల తహసీల్దార్ గోపీకృష్ణ, వేటపాలెం మండల ప్రత్యేక అధికారి, జీఎం డీఐసీ రామకృష్ణ, వేటపాలెం తహసీల్దార్ గీతారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఐడీ కార్డుతో పోలింగ్ కేంద్రాల్లో హల్చల్!

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారంటూ

టీడీపీ అభ్యర్థి భర్తపై కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు

ఫేక్ ఐడీపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..

రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్



కూనవరం నవంబర్ 5,(ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) కూనవరం: పోలింగ్ కేంద్రాల్లో నకిలీ ఐడీ కార్డుతో తిరుగుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారంటూ అధికార టీడీపీకి చెందిన ఎంపీటీసీ అభ్యర్థి భర్త శ్రీమంతుల సత్యనారాయణపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేశారు.కూనవరం మండలం చూచిరేవులగూడెం ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమంతుల త్రివేణి భర్త శ్రీమంతుల సత్యనారాయణ బూత్ ఏజెంట్గా నకిలీ ఐడీ కార్డు తయారు చేసుకుని వివిధ పోలింగ్ కేంద్రాల్లో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీమంతుల వెంకటరమణ ఆరోపించారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన, అక్కడికి వచ్చిన మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ప్రశ్నించారు. దీంతో సంబంధిత వ్యక్తిని ఐడీ కార్డు చూపించాలని అధికారి కోరగా, ఆ కార్డుపై రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోవడంతో అది చెల్లుబాటు కాని ఐడీ కార్డుగా గుర్తించి సదరు వ్యక్తిని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.అయితే, నకిలీ ఐడీ కార్డుతో పోలింగ్ కేంద్రాల్లో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చినప్పటికీ, సంబంధిత వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ ఘటనపై ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నకిలీ ఐడీ కార్డు వినియోగించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు

వ్యవసాయ పరిశోధనలకు వేదికగా బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం

బీపీటీ-5204 సహా నూతన వరి వంగడాల రూపకల్పనలో కీలక పాత్ర

బాపట్ల నవంబర్ 5(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు, నూతన పంట రకాల అభివృద్ధికి బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం కీలక వేదికగా నిలుస్తోందని క్షేత్ర వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానం అందించడం, పీజీ, పీహెచ్డీ విద్యార్థుల పరిశోధనలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.వివిధ రాష్ట్రాల నుంచి బాపట్ల వ్యవసాయ కళాశాలలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి క్షేత్రంలోని పరిశోధనా విభాగాలు, పంటల సాగు విధానాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. క్షేత్రంలోని యార్డు, వరి, జొన్న పంట పొలాలు, అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్, సెలైన్ వాటర్ స్కీం వంటి విభాగాలను సందర్శింపజేసి వాటి ప్రాధాన్యతను తెలియజేశారు



బాపట్ల వ్యవసాయ కళాశాలకు విశేష గుర్తింపు తెచ్చిన బీపీటీ-5204 వరి రకం ఆవిర్భావం వెనుక ఈ క్షేత్ర పరిశోధనల పాత్ర ఎంతో ఉందని విద్యార్థులకు వివరించారు. జీఈబీ-24, టీఎన్-1 రకాల సంకరణం ద్వారా వచ్చిన ఎఫ్-1 తరాన్ని మళ్లీ మసూరి రకంతో సంకరణం చేయడం ద్వారా బీపీటీ-5204 అభివృద్ధి చెందినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, రైతుల అవసరాలకు అనుగుణంగా నూతన వరి వంగడాల రూపకల్పనపై ఇక్కడ పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా బీపీటీ,2858 ఎర్ర బియ్యం, బీపీటీ,2841 నల్ల బియ్యం రకాలు కూడా ఈ క్షేత్రంలోనే రూపొందించినట్లు తెలిపారు. సాధారణ వరి రకాలతో పోలిస్తే ఎరుపు, నలుపు బియ్యంలో ఉండే అదనపు పోషక విలువలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా నల్ల బియ్యంలో ప్రోటీన్లు, ఐరన్, జింక్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఏరువాక కేంద్రాలను సందర్శించి అక్కడి విద్యా, పరిశోధనా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. భారతి, డాక్టర్ ఎస్. హైమజ్యోతి, డాక్టర్ ఆనీ దయానా గ్రేస్, డాక్టర్ జి. వినయ్ కుమార్, డాక్టర్ కె. విజయ్ ప్రకాష్, డాక్టర్ ఎం. ఉష, కె. నాన్సీ జాస్మిన్, డాక్టర్ అంజి బాబు, డాక్టర్ అహ్మద్ ఖాజా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్‌పై ఎస్పీ క్షేత్రస్థాయి పర్యవేక్షణ

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు.
డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



బాపట్ల నవంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ గురువారం చీరాల రూరల్, వేటపాలెం, చిన్నగంజాం మండలాల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. గావినివారిపాలెం, వాడరేవు, దేశాయిపేట, కొత్తపేట, పాపాయిపాలెం, మోటుపల్లి, రాజు బంగారు పాలెం తదితర గ్రామాల్లో పోలింగ్ సరళిని సమీక్షించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణ, పోలీస్ సిబ్బంది విధుల తీరును పరిశీలించిన ఎస్పీ, ఓటర్లను తనిఖీ చేసిన అనంతరమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వంద మీటర్ల పరిధిలో అనవసరంగా ఎవరూ గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ ముగిసే సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిడికి, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టడంతో పాటు అదనపు పోలీస్ బలగాలను మోహరించినట్లు వివరించారు. ప్రతి మండలంలో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు.ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమర్థ్ మొబైల్ యాప్ ద్వారా సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని, సమాచారం అందిన వెంటనే సమీపంలోని పోలీస్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం, పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా సమస్యలు ఎదురైతే పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ 8333813228 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటర్ల భాగస్వామ్యం కీలకం

- ప్రతికూల వాతావరణంలోనూ ఓటు హక్కు వినియోగం అభినందనీయం
- ఇసుకదర్శిలో ఓటు వేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మార్టూరు నవంబరు 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి) ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఉదయం ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన సాధారణ ఓటరుగా క్యూలో నిలబడి ఓటు వేశారు. అనంతరం అక్కడి ఎన్నికల అధికారులతో మాట్లాడి పోలింగ్ నిర్వహణ, ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజల తీర్పే ప్రజాస్వామ్యానికి అసలైన బలమని పేర్కొన్నారు. ఓటు ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.మురుసు తుఫాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రకృతి వైపరీత్యాల మధ్య కూడా ప్రజాస్వామ్య బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ ఓటు వేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ప్రజల్లో పెరుగుతున్న ఎన్నికల చైతన్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, ఇతరుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని ఓటర్లకు సూచించారు. ఓటు హక్కు వినియోగం ద్వారా సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి దోహదపడే నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా యువత, మహిళలు ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఓటర్ల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే ఎన్నికల వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ఎస్పీ ప్రత్యేక నిఘా

- సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఆదేశాలు



గుంటూరు నవంబరు 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పోలింగ్ ప్రారంభమైన వెంటనే జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ హైపర్ సెన్సిటివ్ ప్రాంతాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.మేడికొండూరు మండలం డోకిపర్రు, ఫిరంగిపురం మండలం పొనుగుపాడు, గొల్లపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమపద్ధతిలో ఓటు వేసేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇతర అనుమతి లేని వస్తువులను తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, వంద మీటర్ల పరిధిలో ప్రచారానికి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు నిర్దేశిత పరిధికి వెలుపలే ఉండాలని, పోలింగ్ కేంద్రాల సమీపంలో గుంపులుగా చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల మేరకు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలును పర్యవేక్షించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ స్పష్టం చేశారు. మొబైల్, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ పార్టీలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను గమనించాలని తెలిపారు. ఎక్కడైనా ఉద్రిక్తతలు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పించాలని ఎస్పీ సూచించారు.

నందవరం, సోమలగూడూరు లో ఓటు వేసిన 85 ఏళ్ల వృద్ధులు..



నందవరం, నవంబర్ 5(ప్రజా జ్యోతి):మండల పరిధిలోని స్థానిక ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటింగ్ పాల్గొనాలని83, 85 ఏళ్ల వృద్ధురాలు నరసమ్మ, తెలుగు అంపమ్మ వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం నందవరంలో జరుగుతున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ భాగంగా స్థానిక పోలింగ్ బూత్కు వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ, కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటు వేశారు.

ఎమ్మిగనూరులో తోవి సర్పంచ్ నర్సప్ప కూతుర స్వతంత్ర అభ్యర్థి 36వ వార్డ్ బి.ఎల్.సుకన్య ఘన విజయం



:- 243 ఓట్ల భారీ మెజార్టీతో ఘన గెలుపు అనుచరుల్లో ఆనందోత్సాహాలు

కౌతాళం నవంబర్ 05 ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు పట్టణ మున్సిపల్ ఎన్నికలలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తనయుడు వై.ధరణి రెడ్డి వారి ఆదేశాలు మేరకు 36వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థి కౌన్సిలర్ అభ్యర్థి తోవి మాజీ సర్పంచ్ నరసప్ప కూతుర బి.ఎల్.సుకన్య భారీ విజయం సాధించారు.తన సమీప ప్రత్యర్థిపై 243 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.ఓట్ల లెక్కింపులో ఆరంభం నుంచి ఆధిక్యం కొనసాగించిన సూకన్య విజయం సాధించడంతో ఆమె అనుచరులు, మద్దతుదారుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఫలితాలు వెలువడిన అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.36వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.నా 36వ వార్డు ప్రజలు నాకు ఇంతటి విజయాన్ని అందించిన ప్రజా దేవుళ్లకు మా కుటుంబం తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు అని తెలిపారు.

గ్రామాల్లో పర్యటిస్తూ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

- ఓటర్లు, ఎన్నికల అధికారులతో మాట్లాడి వివరాల సేకరణ
- ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేలా చూడాలని సూచన



బాపట్ల నవంబరు 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. బాపట్ల మండలం పాండురంగాపురం, అడవిపల్లిపాలెం, స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, కంకటపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లతో మాట్లాడి వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బందిని కలిసి పోలింగ్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ఓటింగ్ శాతానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు పోలింగ్ కేంద్రాలకు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎలాంటి అవాంతరాలు లేకుండా పోలింగ్ నిర్వహించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

గాలివీడు మండలంలో 76.95 శాతం పోలింగ్ నమోదు



అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో జరిగిన స్థానిక జడ్పీటీసీ ఎన్నికల్లో 51 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 31,286 ఓట్లు పోలయ్యాయి. వీరిలో 16,825 మంది పురుషులు, 14,461 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 76.95 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

ఎటపాకలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ ప్రక్రియ!

ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు

కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించిన స్వతంత్ర అభ్యర్థి పాయం దేవి

మాజీ వైసీపీ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావుతో కలిసి పలు కేంద్రాల సందర్శన గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన పాయం దేవి



ఎటపాక, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాయం దేవి మండలవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్న తీరును గమనిస్తూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట మాజీ వైసీపీ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఉన్నారు. వీరిద్దరూ గన్నవరం, కృష్ణవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఓటర్ల స్పందన, పోలింగ్ సరళి తదితర వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మండలవ్యాప్తంగా ఓటర్ల నుంచి లభించిన స్పందన, ప్రజల ఆదరణ తనకు అనుకూలంగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న పూర్తి విశ్వాసం ఉందని పాయం దేవి ధీమా వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

రావులపాలెం శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రావులపాలెం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): పరిపూర్ణ మహావతార్ భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో రావులపాలెంలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి నెల మొదటి గురువారం నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా హోమియోపతి, గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, గ్యాస్ట్రిక్ తదితర సాధారణ ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అమలాపురంలోని శ్రీ హోమియో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగులాపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హోమియో పతి వైద్య సేవలు అందించారు. ఈ విభాగంలో 67 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రావులపాలెంలోని భవానీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎం. భీమారెడ్డి, ప్రముఖ లాప్రోస్కోపిక్ వైద్య నిపుణులు, కొత్తపేట శ్రీరామా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ సత్యవరపు విశ్వనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత సమస్యలు, మధు మేహం, గ్యాస్ట్రిక్ తదితర వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్య సలహాలు, సూచనలు అందించారు.

వైద్య శిబిరంలో నిర్వహించిన పరీక్షల వివరాలు:

- హోమియోపతి వైద్య పరీక్షలు -- 67 మంది
- కార్డియాలజీ ఓపీ -- 42 మంది
- డయాబెటిస్ ఓపీ -- 22 మంది
- ఈసీజీ పరీక్షలు -- 11 మంది
- బీపీ, షుగర్ పరీక్షలు -- 60 మంది

వైద్య పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ పురుష సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు కీలక పాత్ర పోషించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాలను సమన్వయం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య సేవలు అందిస్తూ శ్రీ సత్యసాయి సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిపై నిరంతర పర్యవేక్షణ!

జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వెబ్‌కాస్టింగ్

పరిశీలన ఎన్నికల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ, ప్రత్యేక నిఘా





చింతూరు, నవంబర్ 5 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం పోలవరం జిల్లాలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించింది. చింతూరులోని ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్, వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లా ఎన్నికల పరిశీలకులు సి. సెల్వం ఐఏఎస్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు సి. సెల్వం వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలలోపు పోలింగ్ పూర్తయ్యే కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ప్రత్యేకంగా గమనించి, ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పోలింగ్ పరిస్థితులను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఓటింగ్ నిర్వహణ తీరును పరిశీలిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పోలీస్ బందోబస్తు, శాంతిభద్రతల పరిస్థితిని కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పర్యవేక్షించారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ మధ్య జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది

స్థానిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి నిమ్మల.



పాలకొల్లు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రాము. నవంబర్ 5. గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో తమ స్వగ్రామమైన పాలకొల్లు మండలం అగర్తి పాలెం లో తమ కుటుంబ సభ్యులతో కలిసి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. ఇప్పుడు జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతున్నారని మంత్రి నిమ్మల తెలిపారు.

అనంతగిరి మండలంలో ప్రశాంతంగా ముగిసిన జెడ్పి.టి.సి ఎం.పి.టి.సి స్థానిక సంస్థ ఎన్నికలు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు



కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు. అనంతగిరి మండలం. నవంబర్ 5. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్. అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఒక జడ్పిటిసి 14 సెగ్మెంట్ల ఎం.పి.టి.సి స్థానిక సంస్థ ఎన్నికలు గురువారం అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, ఎన్నికల అధికారులు ముందస్తుగా చేపట్టిన కట్టుదిట్టమైన చర్యల వల్ల పోలింగ్ ప్రక్రియ సునాయాసంగా కొనసాగింది.మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఉదయాన్నే మహిళలు, వయోవృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేశారు. మధ్యాహ్నానికి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది.

శ్రీ ఈరన్న స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



కౌతాళం నవంబర్ 05 ప్రజా జ్యోతి శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి వార్ల దేవస్తానం ఉరుకుంద గురువారం రోజున జోగులాంబ గద్వాల జిల్లా సుల్తానాపురం వాస్తవ్యులు శ్రీ మహాదేవ గౌడ్ శ్రీ స్వామివారి దేవాలయ అభివృద్ధి కొరకు 1,00,116/- రూపాయలు విరాళంగా చెల్లించి ఉన్నారు.వారికి దేవస్థానం వారు శ్రీ స్వామి వారి శేష వస్త్రములు లడ్డు ప్రసాదములు మరియు బాండ్ పేపర్ అందజేసి ప్రత్యేక దర్శనం కల్పించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు జె శివకుమార్ మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొనడం జరిగినది.

ప్రశాంతంగా జడ్పిటిసి. ఎంపీటీసీ. ఎన్నికల పోలింగ్.

దేవనకొండ మండలం కుంకునూరు లో ప్రశాంతంగా జెడ్పిటిసి.ఎంపిటిసి ఎన్నికల పోలింగ్.



దేవనకొండ మండలం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు ప్రశాంతంగా. స్వేచ్ఛగా. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుంకనూరు గ్రామంలో ఉదయం ఏడు గంటలకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగి కావడానికి వెళ్ళటం జరిగింది. అక్కడ ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగింది.కాబట్టి. ముఖ్యంగా యువత భారీ సంఖ్యలో ఎన్నికలలో ఓటు వేయడానికి రావడం జరిగింది. కాబట్టి దీనివల్ల ఓటు శాతం భారీగా పెరగడం జరిగింది అలాగే వృద్ధులకు. వికలాంగులకు ఓటు వేయడానికి ప్రత్యేకంగా వాహనాలు. సమకూర్చడం వలన వారు తమ ఓటు హక్కును ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా. ప్రశాంతంగా వినియోగించుకోవడం జరిగింది. ఇలాగే అందరూ ప్రజలు వృద్ధులు వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. దీనివల్ల కుంకునూరులో ప్రశాంతంగా జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలు ఎటువంటి ఘర్షణలు. గొడవలు లేకుండా జరిగాయి

నందవరం మండలం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది..





నందవరం, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన సాయంకాలం 5 గంటల వరకు పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా ఓటు వేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. నందవరం మండలం మొత్తం ఓటర్ల సంఖ్య 48,వేల 111 మంది ఉండగా తమ ఓటు హక్కును 34 వేల 327 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని మండలం మొత్తం ఓటింగ్ శాతం 71. 35 శాతం వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు.

వి.ఆర్. పురం మండలంలో 74.1 శాతం పోలింగ్ నమోదు!..



వరరామచంద్రాపురం,నవంబర్ 5(ప్రజాజ్యోతి ప్రతినిధి) వి.ఆర్. పురం, మండలంలో, నిర్వహించిన జడ్పీ.టీ.సీ,ఎం.పీ.టీ.సీ, ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని మొత్తం 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమై, మొత్తం 20,318 మంది ఓటర్లకు గాను15,065 మంది తమఓటు హక్కును, వినియోగించుకున్నారు. దీంతోమండలవ్యాప్తంగా 74.1%శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లలో 9,696 మంది పురుష ఓటర్లు ఉండగా,వారిలో 7,304 మంది ఓటు వేశారు.దీంతో పురుషుల పోలింగ్ శాతం 75.3గా నమోదైంది.అదేవిధంగా 10,617 మంది మహిళా ఓటర్లకు గాను 7,761 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మహిళల పోలింగ్ శాతం 73.1గా నమోదైంది.మండలవ్యాప్తంగా మహిళలకంటే పురుషుల ఓటింగ్ శాతం స్వల్పంగా అధికంగానమోదైంది.మూడు ప్రధాన రాజకీయ పార్టీలు పోటీలోఉండటంతో ఎన్నికల ఫలితాలపై ఆయాపార్టీల అభ్యర్థులు,నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠనెలకొంది. ఓటర్లుఎవరికి పట్టంకట్టారన్నది ఫలితాలవెల్లడి అనంతరం తేలనుంది.హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.నవంబర్7 న ఫలితాలు వెల్లడిస్తారు.

గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థలే పునాదులు

- స్థానిక సంస్థల బలోపేతంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి
- ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలి
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



అమదాలవలస ,ప్రజాజ్యోతి న్యూస్:స్థానిక ప్రజాస్వామ్యానికి పునాదులైన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మాజీ శాసనసభాపతి,వైసీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు , శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ఇన్చార్జ్ తమ్మినేని సీతారాం, తన సతీమణి తొగరాం మాజీ సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీతో కలిసి గురువారం తమ స్వగ్రామమైన ఆముదాలవలస మండలం తొగరాంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఇద్దరూ తమ ఓటును నమోదు చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాముల య్యారు.ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు స్థానిక సంస్థలే కీలకమైన పునాదులని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్య లక్ష్యం సాకారమవుతుందని అన్నారు. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే గ్రామాల అభివృద్ధికి సరైన దిశ, ప్రజల అవసరాలకు అనుగుణమైన పాలన సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.ఎన్నికలు కేవలం ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదని, గ్రామాల భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని, ఓటు ద్వారా ప్రజలు తమ ఆకాంక్షలను ప్రతిబింబించాలని తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు.

ఎటపాకలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ ప్రక్రియ!

ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు

కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించిన స్వతంత్ర అభ్యర్థి పాయం దేవి

మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావుతో కలిసి పలు కేంద్రాల సందర్శన గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన పాయం దేవి





ఎటపాక, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలంలో పోలింగ్ కేంద్రాలను గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మండలవ్యాప్తం గా ఏర్పాటు చేసిన వివిధ పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటపాక జెడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాయం దేవి మండలవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్న తీరును గమనిస్తూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎటపాక మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఉన్నారు. వీరిద్దరూ గన్నవరం, కృష్ణవరం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఓటర్ల స్పందన, పోలింగ్ సరళి తదితర వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మండలవ్యాప్తంగా ఓటర్ల నుంచి లభించిన స్పందన, ప్రజల ఆదరణ తనకు అనుకూలంగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న పూర్తి విశ్వాసం ఉందని పాయం దేవి ధీమా వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

ఆలమూరు మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు





18 గ్రామాల్లోని 77 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట పోలీసు భద్రత.

ఆలమూరు నవంబర్ 5(ప్రజాజ్యోతి):డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచనలతో ఆలమూరు మండలంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలంలోని 18 గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన 77 పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలమూరు ఎస్సై జి. నరేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.పోలింగ్ ప్రారంభమైన ఉదయం నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఈ ఎన్నికల విధుల్లో దిశా డీఎస్పీ, ఆలమూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బంది, ట్రైనీ పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించారు.జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహించినట్లు ఎస్సై జి. నరేష్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు, ఓటర్లు పోలీసులకు సహకరించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి పాలనలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగిస్తున్నారు!





బూత్ ఏజెంట్ల అరెస్టులపై డాక్టర్ దారా సుధీర్ ఆగ్రహం

బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని హౌస్ అరెస్టు చేయడం మూర్ఖపు చర్య

ప్రజా జ్యోతి నందికొట్కూరు కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే విధంగా పోలీసుల వ్యవహారశైలి ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో బూత్ ఏజెంట్లను అరెస్టు చేయడం, పోలీసు వాహనాలతో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజల్లో ఆందోళన కలిగించడం వంటి చర్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని హౌస్ అరెస్టు చేయడం సరైన చర్య కాదని, ఇది మూర్ఖపు చర్య అని డాక్టర్ దారా సుధీర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులకు, ప్రజలకు తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమని, అలాంటి ఏజెంట్లను అరెస్టు చేయడం వెనుక ఉన్న కారణాలను అధికారులు ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. బూత్ ఏజెంట్లపై ఎలాంటి ఆరోపణలు ఉన్నాయని, ఏ చట్టం, ఏ నిబంధనల ప్రకారం వారిని అదుపులోకి తీసుకుంటున్నారని పోలీసు అధికారులను ప్రశ్నించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా కాకుండా చట్ట ప్రకారం, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు.ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డాక్టర్ దారా సుధీర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మన్సూర్, బద్దల శ్రీకాంత్, బైరాపురం ఫయాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు, ప్రజలకు,అధికారులకు అందరికీ ధన్యవాదాలు!..

జడ్పీ.టి.సి,అభ్యర్థి వాళ్ళ విష్ణుప్రియ!..



వరరామచంద్రాపురం, నవంబర్5(ప్రజాజ్యోతి ప్రతినిధి) ఎన్నికల ప్రక్రియ అద్భుతంగా జరిగిందని, ప్రజా స్వామ్య పద్ధతిలో వరరామచంద్రాపురం, జడ్పీ. టి.సి, మరియూ7 ఎం.పి.టి.సి, ఎన్నికలకు సహకరించిన అధికారులకు, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిజేస్తూ న్నానని. జడ్పీ.టి.సి,అభ్యర్థి వాళ్ళ విష్ణు ప్రియ, తెలియజేశారు. గురువారం ప్రజా జ్యోతి ప్రతి నిధితో, మాట్లాడుతూ, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, విభేదాలు పెట్టుకో కుండా ప్రశాంత వాతావరణంలో మండల వ్యాప్తంగా ఎన్నికలు జరగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని వివరించారు. సహకరించిన కూటమి పార్టీ, కార్యకర్తలకు, పార్టీ నాయకులకు అధికారులకు, ప్రజాస్వామ్య ప్రక్రియ విజయవంతంగా సాగడానికి సహకరించి న పోలీస్ సిబ్బందికి ఎలక్షన్ అధికారులకు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా మని తెలిపారు.

అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు!..

సి.పి.ఎం,పార్టీ.మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్!..



వరరామచంద్రాపురం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి ప్రతినిధి)ఎన్నికల ప్రక్రియ అద్భుతంగా జరిగిందని, ప్రజాస్వామ్య పద్ధతిలో వరరామ చంద్రాపురం, జడ్పీ.టి.సి, మరి యూ 7 ఎం.పి.టి.సి, ఎన్నికలకు జరిగిన విషయం తెల్సిందే. ఈ ఎన్నికలు ఐక్యతకు నిదర్శనం. మని, సి.పి.ఎం ,పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, స్పష్టం చేశారు. గురువారం ప్రజా జ్యోతి ప్రతినిధితో, మాట్లాడుతూ, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, విభేదాలు పెట్టుకోకుండా ప్రశాంత వాతావరణంలో మండల వ్యాప్తంగాఎన్నికలు జరగడం ఎంతో సంతోషాన్ని కలివిం చిందని, ఆనందం వ్యక్తం చేశారు. సహకరించిన, సి.పి.ఎం, పార్టీ, కార్యకర్తలకు, వివిధ పార్టల నాయకులకు అధికారులకు, ప్రజాస్వామ్య ప్రక్రియ విజయవంతంగా సాగడానికి సహకరించిన పోలీస్ సిబ్బందికి, ఎలక్షన్ అధికారులకు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వివరించారు.

సహకరించిన ప్రతీఒక్కరికీ ధన్యవాదాలు!..

వై.కా.పా,జడ్పీ. టి.సి, అభ్యర్థిని బంధం వినయలక్ష్మీ!..



వరరామచంద్రాపురం, నవంబర్ 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి)మండల వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో, ప్రజా స్వామ్య పద్ధతిలో వరరామచంద్రాపురం, 1జడ్పీ. టి.సి, మరియూ 7 ఎం.పి.టి.సి, ఎన్నికలకు సహక రించిన పార్టీ కార్యకర్తలకు, పార్టీ నాయకుల కు, ప్రజలకు,. మహిళా ఓటర్లకు ధన్యవాదాలు తెలుపు తున్నానని జడ్పీ.టి.సి, అభ్యర్థిని బం ధం వినయ లక్ష్మీ, తెలిపారు. గురువారం ప్రజా జ్యోతి ప్రతినిధితో, మాట్లాడుతూ, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, విభేదాలు పెట్టుకోకుండా ప్రశాంత వాతావరణంలో మండల వ్యాప్తంగా ఎన్నికలు జరగడం ఎంతో సంతోషాన్ని కలివిం చిందని, ఆనందం వ్యక్తం చేశారు. సహకరించిన, వై.కా.పా, కార్యకర్తలకు, నాయకులకు, మహిళా ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. అధికారులకు, ప్రజాస్వామ్య ప్రక్రియ విజయ వంతంగా సాగడానికి సహకరించిన పోలీస్ సిబ్బందికి,ఎలక్షన్ అధికారులకు, హృదయపూ ర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వివరించారు.

86 ఏళ్ల వయస్సులోనూ ఓటు హక్కు వినియోగం

– కింతలి లో వృద్ధుడి ఓటు వేసే ఉత్సాహం.. అందరికీ ఆదర్శం



పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:పొందూరు మండలం కింతలి గ్రామంలో ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన 86 ఏళ్ల వృద్ధుడు దొంపల లక్ష్మణరావు వయోభారాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.కొంత గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి స్వయంగా వచ్చిన లక్ష్మణరావు ఎంతో ఉత్సా హంగా ఓటు వేశారు. వయస్సు మీద పడినా ప్రజాస్వామ్య ప్రక్రియలో తన వంతు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం పలువురిని ఆకట్టుకుంది. 86 ఏళ్ల వయస్సులోనూ ఓటు వేసేందుకు ఆయన చూపిన ఆసక్తిని చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కొతాళం మండలం 69 శాతం పోలింగ్ నమోదు

:-కొతాళం మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

:-అధికారుల పటిష్ట పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో ముగిసిన పోలింగ్

:-ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు,భారీగా మోహరించిన పోలీస్ సిబ్బంది





కొతాళం నవంబర్ 05 ప్రజా జ్యోతి కొతాళం మండల పరిధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది.మండల వ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించు కోవడంతో 69 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా చేసిన పటిష్ట పర్యవేక్షణ, బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ విజయవంతమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ ఓ) రంగస్వామి,జోనల్ ఆఫీసర్ శోభారాణి సీఐ ప్రకాష్ కుమార్, ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి,ఎంపీడీవో స్వర్ణలత,అగ్రికల్చర్ అధికారి శేషాద్రి నిరంతరం మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ, సిబ్బందికి తగిన సూచనలు ఇస్తూ ప్రక్రియను పర్యవేక్షించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీఐ



ప్రకాష్ కుమార్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. కొతాళం మండల ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రశాం తంగా ఓటు హక్కు వినియోగించుకునేలా కట్టుదిట్టమైన



భద్రతా చర్యలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వల్లే మండలంలో ఎన్నికలు పకడ్బందీగా, విజయవంతంగా ముగిశాయని ప్రజలు అధికారులపై హర్షం వ్యక్తం చేశారు.

దువ్వూరు లో... ముగిసిన ఎంపీటీసి ఎన్నికల పోలింగ్





దువ్వూరు,నవంబరు05(ప్రజా జ్యోతి) దువ్వూరు మండలంలో రెండు స్థానాలకు జరిగిన ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 13 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. టి.చల్లబ సాయిపల్లె,నీలాపురం ఎంపీటీసీ స్థానాలకు గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్ఓ రవిచంద్రబాబు తెలిపారు.ఉదయం నుంచే ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం పర్యవేక్షణ చేపడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలో 71. 75 శాతం పోలింగ్ జరినట్లు ఆర్వో రవిచంద్రబాబు వెల్లడించారు. టి.చల్లబసాయి పల్లె ఎంపీటీసీ స్థానం కు 76% పోలింగ్ నమోదయిందని. అలాగే నీలాపురం ఎంపీటీసీ స్థానంకు 68.6% పోలింగ్ నమోదు అయినట్లు ఆర్వో తెలిపారు.అధికారుల సమన్వయం, పోలీసుల పటిష్ట భద్రత మధ్య రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.బ్యాలెట్ బాక్స్ లను జమ్మలమడుగు లోని పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ కు తరలించామన్నారు. ఏడవ తేదీన జమ్మలమడుగు లోని కౌంటింగ్ కేంద్రం లో ఈ రెండు ఎంపీటీసీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

స్వల్ప ఉద్రిక్తత : చల్లబసాయపల్లె ఎంపిటిసి పరిధిలోని పుల్లారెడ్డి పేట పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.పోలీసులు పుల్లారెడ్డి పేట గ్రామస్తులను వైసిపి సానుభూతి పరులను ఓటు వేయకుండా అడ్డుకుంటున్నారని,తమ ఓట్లు ను వేయనీయడం లేదంటు పుల్లారెడ్డి పేట గ్రామస్తులు, వైసిపి నాయకులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఈ నేపథ్యంలో దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు, చాపాడు ఎస్ఐ పెద్దయ్య లు తిరుపాల్ రెడ్డి కి సర్ది చెప్పడంతో తామ ఎన్నికల ను బాయికాట్ చేస్తున్నట్లు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు



నందవరం, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): మండల కేంద్రం నంద వరంలో జరిగిన ఎంపీటీసీ స్థానిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేసి తమ బాధ్యతను నిర్వర్తించారు. ఈ సందర్భంగా దేశాయ్ మాధవరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అందుబాటు లో ఉండే నాయకులను, ప్రజా సమస్యలపై స్పందించే ప్రతినిధు లను ఓటు ద్వారా ఎన్నుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే బాధ్యత అని ఆయన అన్నారు. ప్రజల అభిప్రాయమే ప్రజాప్రతినిధుల ఎంపికలో కీలకమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని, అర్హులైన ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని తెలిపారు.

ప్రవల్లిక మృతి తర్వాత ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్ : మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది. ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు.

ప్రజాస్వామ్య పండుగలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగుల ఉత్సాహం..
సమస్యాత్మక గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తతలు
గోకర్ణపల్లి, రాపాకలో ఇరు పార్టీల మధ్య వివాదాలు..
పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల అబ్జర్వర్











పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్ :ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని పొందూరు మండలంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ స్వల్ప వివాదాల మధ్య ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వృద్ధులు, దివ్యాంగులు సైతం ప్రజాస్వామ్య పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, న్యాయమూర్తి బి జ్యోత్స్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పి.యూ.సీ చైర్మన్ కూన రవికుమార్ తన స్వగ్రామమైన పొందూరు మండలం పెనుబర్తిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. జ్యోత్స్న సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఓటు చైతన్యం ప్రజాస్వామ్య పండుగలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. వయోభారం, శారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అందరికీ ఆదర్శంగా నిలిచింది. సమస్యాత్మక గ్రామాల్లో స్వల్ప వివాదాలు మండలంలోని గోకర్ణపల్లి, రాపాక, సింగూరు తదితర గ్రామాల్లో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా అత్యంత సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన గోకర్ణపల్లి పంచాయతీ పరిధిలోని రంగనాథపేటకు చెందిన పలువురు ఓటర్లను వైసీపీ సానుభూతిపరులనే కారణంతో టీడీపీ వర్గీయులు అడ్డుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని గ్రామానికి వచ్చిన అడిషనల్ ఎస్పీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లడంతో, పోలీసుల సమక్షంలో వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేసేలా చర్యలు చేపట్టారు. పోలింగ్ సమయం ముగిసినా ఓటు విషయంలో వివాదం మరోవైపు రాపాక గ్రామంలో పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఓటు వేసేందుకు వచ్చిన ఓటరును వైసీపీ నేతలు అడ్డుకోవడంతో ఇరు పార్టీల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్,జిల్లా ఎన్నికల అబ్జర్వర్ ,అడిషనల్ ఎస్పీ ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మల్లవరపు సూర్య తేజ (ఐఏఎస్), అడిషనల్ ఎస్పీ వివేకానంద పొందూరు, తోలాపి సహా పలు సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించి ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పటిష్ఠ బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణ పొందూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాశ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎస్. వాసుదేవరావు, వెంకటేష్ రామానుజుల, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి దుంపల అప్పన్న, ఏఎస్ఐ జి. త్రినాథరావు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. స్థానిక ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ పరిస్థితులను సమీక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. మొత్తంగా స్వల్ప వివాదాలు మినహా పొందూరు మండలంలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ.



పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 5. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో పశ్చిమగోదావరి జిల్లా వాసవి పెనుగొండలోని పోలింగ్ కేంద్రంలో ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ కుటుంబ సమేతంగా విచ్చేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో పలుచోట్ల ఓటర్ స్లిప్పుల పంపిణీలో ఎన్నికల అధికారులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. నిబంధనలు కేవలం రాజకీయ పార్టీలకే పరిమితమా అధికారులకు వర్తించవా అని ఎమ్మెల్యే పితాని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఆదేశాలను గౌరవిస్తూ రాజకీయ పార్టీలు ఓటర్ స్లిప్పుల పంపిణీకి దూరంగా ఉన్నప్పటికీ, ఆ బాధ్యత తీసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్లకు సకాలంలో స్లిప్పులు అందించలేకపోయారని పితాని సత్యనారాయణ మండిపడ్డారు. పోలింగ్‌కు కనీసం రెండు రోజుల ముందే ప్రతి ఇంటికీ ఓటర్ స్లిప్పులు చేరేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ఓటర్లు, పార్టీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎన్నికల కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాపట్ల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

67.52 శాతం పోలింగ్ నమోదు. పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూములకు బ్యాలెట్ బాక్సులు తరలింపు



బాపట్ల నవంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) బాపట్ల జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తం 67.52 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని 1,092 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,83,635 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 2,84,931 మంది పురుషులు, 2,98,704 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు పురుషుల కంటే అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను పోలీస్ బందోబస్తు మధ్య ఆయా రిసెప్షన్ కేంద్రాలకు తరలించి, అక్కడి నుంచి గురువారం రాత్రి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ఓటర్లు, ఎన్నికల సిబ్బంది, పోలీసు యంత్రాంగానికి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు చేరికల జోష్

నిర్మల్ : నిర్మల్‌కు చెందిన నల్ల వినయ్ రెడ్డి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ నెల 11న నిర్మల్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రైతు గర్జన సభ జరగనుంది. రైతు గర్జన సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చేలా బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ కంటే ముందే బీఆర్ఎస్ లో చేరికలు కొనసాగున్నాయి.

ఒకే రోజు రెండు ప్రమాదాలు

క్షేమంగా బయటపడ్డ ఎమ్మెల్యే వేముల

నల్గొండ : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాలకు గురై తృటిలో బయటపడ్డారు. బుధవారం నకిరేకల్ నుంచి చిట్యాల వెళ్తుండగా వీరేశం ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారును కార్నివాల్ కారు ఢీకొట్టింది. తరువాత అయన వేరే కారులో బయలుదేరారు. చిట్యాల నుంచి తుంగతుర్తికి వెళ్తుండగా క్రిస్టా కారును లారీ ఢీకొట్టింది. రెండు వరుస ప్రమాదాల నుంచి వేముల వీరేశం బయటపడ్డారు.

అమెరికా ఎన్నికల్లో హైదరాబాదీలు సరిత ఓడారు... విజయ గెలిచారు

హైదరాబాద్ : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో తెలుగు మూలాలున్న ఇద్దరు మహిళలు ఇప్పుడు వార్తల్లో నిలిచారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పోటీ చేసిన హైదరాబాదీ అరుణా మిల్లర్ వరుసగా రెండోసారి విజయ దుంధుభి మోగించారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవి కోసం బరిలోకి దిగిన తెలుగు సంతతి మహిళ సరితా కోమటిరెడ్డి ఓటమిపాలు కావడం గమనార్హం. ఒకరు విజయంతో మరోసారి ఉన్నత పదవిని చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. మరొకరు ప్రజా సేవ కొనసాగిస్తానంటూ ఓటమిని అంగీకరించారు. అమెరికా రాజకీయాల్లో భారతీయ, ముఖ్యంగా తెలుగు మూలాలున్న మహిళల ప్రాతినిధ్యంపై ఈ ఫలితాలు మరోసారి చర్చకు దారితీశాయిమేరీల్యాండ్‌లో డెమోక్రటిక్ పార్టీ తరఫున గవర్నర్ వెస్ మూర్‌తో కలిసి పోటీ చేసిన అరుణా మిల్లర్‌కు ఓటర్లు మరోసారి పట్టం కట్టారు. నవంబర్ 3వ తేదీన జరిగిన ఎన్నికల్లో మూర్-మిల్లర్ జోడీకి 62.55 శాతం ఓట్లు లభించాయి. దీంతో అరుణా మరో 4 ఏళ్లపాటు లెఫ్టినెంట్ గవర్నర్‌గా కొనసాగనున్నారు. 2022 ఎన్నికల్లో ఈ జోడీకి 64.53 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికతో పోలిస్తే ఓట్ల శాతం కొంత తగ్గినా.. స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించడం విశేషం. మేరీల్యాండ్ ఎన్నికల బోర్డు వెల్లడించిన తాజా ఫలితాల్లో ఈ వివరాలు నమోదయ్యాయి.అరుణా మిల్లర్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 1964 నవంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో తెలుగు కుటుంబంలో జన్మించిన అరుణా మిల్లర్.. 7 ఏళ్ల వయసులోనే తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. న్యూయార్క్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన అనంతరం మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ చదివారు. తర్వాత రవాణా రంగంలో ఇంజినీర్‌గా పనిచేశారు. కాలిఫోర్నియా, వర్జీనియా, హవాయి రాష్ట్రాల్లో సుమారు 25 ఏళ్లపాటు వృత్తిపరమైన సేవలు అందించారు.1990లో మేరీల్యాండ్‌కు మారిన అరుణా మిల్లర్.. ప్రజా సమస్యలపై ఆసక్తితో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

వెయ్యి టీఎంసీల నీటిని సముద్రం పాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డిది!

క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



కమలాపూర్ : మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యంలో తరుగు పేరుతో అధికంగా కోతలు విధించకుండా, నిబంధనల ప్రకారం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలంతో పాటు ఐదు మండలాలు, రెండు పట్టణాల్లో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీళ్లు లేక పదెకరాలు ఉన్న రైతులు ఐదెకరాలు, నాలుగెకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. ఐదెకరాలు ఉన్న రైతులు రెండు ఎకరాలు, ఎకరం మాత్రమే సాగు చేసుకునే దుస్థితి ఏర్పడింది. రైతులు పంటలు వేసుకోలేని పరిస్థితి రావడం అత్యంత బాధాకరం. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 25 వేల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నా కాళేశ్వరం నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నిస్తున్నాం. ఈ లెక్కలు నా సొంతంగా చెబుతున్నవి కావు. కేంద్ర జల సంఘం (అవనిబితీజీశ్రీ చిజీబివతీ అనీఎఎతిబబతినీని) గణాంకాల ప్రకారం ఇప్పటికీ ఆన్‌లైన్‌లో 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఆ నీటిని లిఫ్ట్ చేసి ఉంటే హుజురాబాద్ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందేదని అన్నారు. గతంలో కేటీఆర్ తో కలిసి వేలాది మంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి లక్ష క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందించాలని కోరాం. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా నీటిని సముద్రం పాలు చేసింది. గోదావరి నుంచి సుమారు 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీటిని వినియోగించుకోకుండా సముద్రం పాలు చేసిన ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా? కేసీఆర్ పాలనకు.. కాంగ్రెస్ పాలనకు తేడా రైతులకు స్పష్టంగా కనిపిస్తోంది. కేసీఆర్ గారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజైనా రైతులకు సాగునీటి సమస్య వచ్చిందా? 24 గంటల ఉచిత విద్యుత్ అందకుండా పోయిందా? రైతుబంధు అందని సీజన్ ఉందా? దురదృష్టవశాత్తూ రైతు చనిపోతే ఆ కుటుంబానికి రైతుబీమా కింద రూ.5 లక్షలు అందకుండా పోయాయా? రైతులు ఒక్కసారి గుండె మీద చేయి వేసుకొని ఆలోచించాలి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పుష్కలంగా నీళ్లు వచ్చాయి. 24 గంటల కరెంటు వచ్చింది. రైతుబంధు, రైతుబీమా అందాయి. మరి కేసీఆర్ గారు అధికారంలో నుంచి దిగిపోయిన తర్వాతే నీళ్ల సమస్యలు, కరెంటు కోతలు, యూరియా, డీఏపీ కొరతలు ఎందుకు వస్తున్నాయి?

ఏ పంట పండించినా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ బోనస్ ఏమైంది? రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ మాటలుగానే మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ క్రాప్ హాలిడే ప్రకటించడం ఏంటి? రైతులు పంటలు పండించకుండా చేసే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తే సామర్థ్యం ఉంది. ఇప్పటికీ సమయం మించిపోలేదు. ఈ క్షణం కూడా నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందిస్తే రైతులు మళ్లీ పంటలు వేసుకునే అవకాశం ఉంది. దయచేసి రాజకీయాలు చేయకండి. రైతుల జీవితాలతో చెలగాటం ఆడకండి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సాగునీటిని అందించాలి. హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్, ఇల్లంతకుంట, జమ్మికుంట, వీణవంక, హుజురాబాద్ మండలాలతో పాటు హుజురాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రైతులకు వెంటనే సాగునీరు అందించాలి. క్రాప్ హాలిడే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఒకవేళ క్రాప్ హాలిడే ప్రకటిస్తే నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు. రైతుల పక్షాన, రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.

కాంగ్రెస్ లో నిధుల మంటలు

మహబూబ్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా పార్టీ అంతర్గత విభేదాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి నేరుగా తమ సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యాఖ్యలు చేయడం, విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం టీపీసీసీలో పెను దుమారం రేపుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేల వేదన, ఆరోపణలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి? నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు రావడం లేదు, మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత దక్కలేదు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల తరహాలోనే పోరాడాల్సి వస్తోంది అని వారు బహిరంగంగానే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అసంతృప్తి వెనుక కేవలం నిధులు, మంత్రి పదవుల ఆశలు మాత్రమే కాక టెండర్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కకపోవడం కూడా ఉందనే ఆరోపణలు నడుస్తున్నాయి. హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, లోకల్ కాంట్రాక్టర్లను పక్కనబెట్టారని రాజగోపాల్ రెడ్డి నేరుగా సీఎంఓ నిఘా, టెండర్ల కేటాయింపులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. మరోవైపు, జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, ఫండ్స్ విడుదల కాకపోవడంతో అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్షకు హెచ్చరికలు జారీ చేసే దాకా పరిస్థితి దాటింది.అయితే, ఈ ఇద్దరి అసంతృప్తుల వెనుక పొలిటికల్ అజెండాలు ఉన్నాయనే భావనతో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కోటరీ దీనిని లైట్ తీసుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజగోపాల్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇమేజ్ ఉన్నప్పటికీ, ఆయన గతంలో పార్టీ మారిన నేపథ్యం ఉండటంతో హైకమాండ్ వద్ద ఆయన ఒత్తిళ్లకు తలొగ్గకూడదని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్లకు పదవులు ఇస్తూ పోతే కొత్తగా వచ్చిన వారికి లేదా రేవంత్ విధేయులకు అవకాశాలు దక్కవనే వ్యూహంతోనే వీరి కామెంట్లను ప్రభుత్వం తీవ్రంగా పట్టించుకోకుండా ఉపేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇద్దరు



ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి విమర్శలు చేస్తుంటే, వారికి సర్దిచెప్పడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేదా పార్టీ సీనియర్ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, అసమ్మతి వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేయడం మంటలపై నెయ్యి పోసినట్లు పనిచేస్తోంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన సమస్యలు మీడియా ముందుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడికి , ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతర్గత తిరుగుబాటు రూపంలో పెద్ద చికాకులు తప్పవు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఓపెన్‌గా గళం విప్పుతుండటంతో, లోలోపల నిధులు రాక, హామీలు నెరవేర్చలేక సతమతమవుతున్న మరికొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వీరికి మద్దతుగా నిలిచే అవకాశాలు లేకపోలేదు. అసెంబ్లీలో మెజారిటీకి ముప్పు లేకపోయినప్పటికీ, స్వపక్ష ఎమ్మెల్యేలే రెబెల్స్ గా మారి అవినీతి, నిధుల మళ్లింపు ఆరోపణలు చేస్తే.. అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు ఉచితంగా పొలిటికల్ ఆయుధాలను అందించినట్లవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల కొరత, ప్రాధాన్యతలేమి అనేది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలకే పరిమితమైన సమస్య కాదు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అసంతృప్త నేతలతో సమావేశమై టెండర్లు, నిధుల విడుదల మరియు పదవుల భర్తీపై స్పష్టమైన భరోసా ఇవ్వకపోతే, ఈ చిన్న నిప్పు రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్ స్థిరత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే పెద్ద దావానలంగా మారే ప్రమాదం ఉంది.

తెలంగాణపై ఎల్‌నీనో ఎఫెక్ట్.. బోర్‌వెల్స్‌కు ఎన్‌వోసీ తప్పనిసరి

హైదరాబాద్ : ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చూడటం, లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో జల వనరులను సంరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాగునీటి అవసరాలు తప్ప ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. 2027 జులై చివరి వరకు అమల్లో ఉండేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో 259 ద్వారా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

జీవో 259లోని ముఖ్యమైన నిబంధనలు

అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులు, వాణిజ్య-పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, బల్క్ వాటర్ సప్లైయిర్లు భూగర్భ జలాల వినియోగ నిబంధనలు-2023 ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందిన తర్వాతే కొత్త బోర్లు తవ్వాల్సి ఉంటుంది. అనుమతులతో బోర్‌వెల్ తవ్వకం పూర్తి చేసిన 15 రోజుల్లోగా రిగ్ ఆపరేటర్ నిర్ణీత అధికారికి 'వెల్ కంప్లీషన్ రిపోర్ట్'ను సబ్మిట్ చేయాలి. ఆ బోర్‌వెల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి.

నిర్మాణ ప్రాజెక్టులు, తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు భూగర్భ జలాలను వాడకూడదు. జలమండలి అందుబాటులోకి తెచ్చిన శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలి. భూగర్భ జలాలను అక్రమంగా వెలికితీసినా లేదా దుర్వినియోగం చేసినా 'వాల్టా' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రతిఒక్కరూ వాననీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలకు



ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. భూగర్భజల శాఖ: నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టాలి.ల మున్సిపల్ కార్పొరేషన్లు: భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణాలను తప్పనిసరిగా అమలు చేయించాలి. హైడ్రా : చెరువులు, కుంటలు, నీటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్, కాలుష్యం నుంచి కాపాడాలి. మంచి నీటి సరఫరా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లో లీకేజీలు, వృథాను అరికట్టడంతో పాటు కంటింజెన్సీ మానిటరింగ్ కమిటీకి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందించాలి.

భీమ్‌రెడ్డి కేసులో ఇళ్లు, భూముల అటాచ్‌మెంట్

లంచంగా ఇచ్చినట్లు ఆరోపణలున్న రెండు ఇళ్లు, ఇన్నోవా కారు స్వాధీనానికి చర్యలు

నాలుగు వ్యవసాయ భూములపైనా ఆదాయపు పన్ను శాఖ అంక్షలు

హైదరాబాద్: పోలీసు అధికారి సంకిరెడ్డి భీమ్‌రెడ్డి, ఆయన భార్యకు సంబంధించిన బినామీ ఆస్తుల వ్యవహారంలో ఆదాయపు పన్ను శాఖ మరిన్ని ఆస్తులను గుర్తించింది. అధికారికంగా చేసిన మేళ్లకు ప్రతిఫలంగా ఇచ్చినట్లు ఆరోపణలున్న రెండు ఇళ్లు, వివాదాల పరిష్కారంలో సహకరించినందుకు అందించినట్లు భావిస్తున్న ఇన్నోవా కారు సహా పలు ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఆదాయపు పన్ను శాఖలోని బినామీ ఆస్తుల నిరోధక విభాగం (బీపీయూ) నవంబరు 3న మూడు ఉత్తర్వులు జారీ చేసింది.పటాన్‌చెరు పరిధిలోని ముత్తంగిలో రెండు ఇళ్లు, మొగుడంపల్లిలో 3.20 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు వ్యవసాయ భూములు, టయోటా ఇన్నోవా క్రిస్టా కారు ఈ జాబితాలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్న ధరలు, వాహనం విలువ ప్రకారం వీటి మొత్తం విలువ రూ.59.4 లక్షలు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం స్థిరాస్తుల విలువ పలుకోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. హైదరాబాద్



బీపీయూ ఈ ఆస్తులపై అటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది.అధికారికంగా చేసిన మేళ్లకు ప్రతిఫలంగా ఇళ్లు ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు ప్రకారం.. జీపీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ 2023 జులైలో ముత్తంగిలోని బృందావన్ గార్డెన్స్‌లో రెండు ఇళ్లను పోతుగంటి ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో బదిలీ చేసింది. ఇందుకు ఎలాంటి డబ్బు తీసుకోలేదు. ఒక్కో ఇల్లు 200 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఒక్కోదాని విలువ రూ.14.2 లక్షలుగా పేర్కొన్నారు.పటాన్‌చెరు సబ్‌డివిజనల్ పోలీసు అధికారిగా (ఎస్‌డీపీవో) పనిచేసిన సమయంలో భీమ్‌రెడ్డి చేసిన మేళ్లకు ప్రతిఫలంగానే ఈ ఇళ్లు ఇచ్చారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకపోవడం, సంస్థకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో సహకరిం చడం వంటి పనులు చేసినట్లు పేర్కొంది.జీపీఆర్ హౌసింగ్ డైరెక్టర్ జి.కల్యాణ్‌బాబు ఇచ్చిన వాంగ్మూలాన్ని అధికారులు ఈ కేసులో ప్రస్తావించారు. కృతజ్ఞతగా ఆ ఇళ్లను ఇచ్చినట్లు ఆయన చెప్పారని పేర్కొన్నారు. భీమ్‌రెడ్డి సూచన మేరకే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు తన పేరును ఉపయోగించుకునేందుకు అంగీకరించినట్లు ఇంద్రకరణ్‌రెడ్డి ఒప్పుకొన్నారని తెలిపారు. విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించిన రికార్డులను కూడా అధికారులు ఆధారాలుగా తీసుకున్నారు.హోంగార్డు పేరుతో 3.20 ఎకరాల భూమిమొగుడంపల్లిలోని నాలుగు వ్యవసాయ భూములను హోంగార్డు లక్ష్మణ్ నాయక్ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. వీటి విలువను పత్రాల్లో రూ.8.9 లక్షలుగా పేర్కొన్నారు. ఈ భూముల అసలు లబ్ధిదారుల్లో భీమ్‌రెడ్డి ఒకరని ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది.అధికారిక మేళ్లకు ప్రతిఫలంగా ఇన్నోవాయాపిల్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని ఆలూరి సురేష్ పోలీసు అధికారి భీమ్‌రెడ్డికి టయోటా ఇన్నోవా క్రిస్టా కారును అందించినట్లు బీపీయూ ఆరోపించింది. ప్రమాదాలకు సంబంధించిన వివాదాల్లో సహకరించినందుకు ప్రతిఫలంగా ఈ వాహనాన్ని ఇచ్చినట్లు పేర్కొంది.అటాచ్‌మెంట్ ఉత్తర్వుల్లో కారు విలువను రూ.22 లక్షలుగా చూపారు

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

కమాన్ పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు. ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, చిందం తిరుపతి, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, జాబు సతీష్, , రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, పొట్ల సతీష్, కొయ్యడ సంపత్, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, పొట్ల శంకర్, కొండిల్ల ఓదెలు, గుర్రం శంకర్, ఒడ్నాల సతీష్, షేక్ మొహినుద్దీన్, దండే రమేష్ ఠాగూర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి బోరు మోటార్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ : నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి, త్రాగు నీటి వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా గురువారం 31 వ డివిజన్ దుర్గమ్మగడ్డ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేత పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కార్పోరేటర్ ముఖద్దర్ హుస్సేన్ అలీతో కలిసి మంచి నీటి బోరు మోటారును అధికారికంగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మా పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తత ఎల్ నినో ప్రభావం, రానున్న వేసవి కాలం దృష్ట్యా... నగర ప్రజల త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజల త్రాగు నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రాధాన్యతగా మంచి నీటి వసతి సౌకర్యాలతో పాటు డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి క్రార్యక్రమాల లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ గ్రాంట్ల ద్వారా ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులను ప్రారంభం చేసి శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. దుర్గమ్మ గడ్డ పరిసర ప్రాంతాల్లోని భక్తులకు, స్థానిక ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు ఈ బోరు మోటార్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నగరపాలక సంస్థ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

గాంధీ హాస్పిటల్ మురుగు నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులకు సమస్యలు

తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్ : లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న గాంధీ హాస్పిటల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్ నుండి వెలువడుతున్న మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పాటు దుర్గంధం కారణంగా తాము అనేక అవస్థలు, అనారోగ్యం పాలు అవుతున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తలసాని గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా. ఉషారాణి, వైద్యులతో పాటు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీఎస్ఎంఐడీసీ శాఖల అధికారులతో కలిసి సమావేశం అయ్యారు. మురుగు నీటి తో పాటు మార్చరీ నుండి వెలువడుతున్న దుర్వాసన కారణంగా గాంధీ హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పద్మారావు నగర్, తదితర ప్రాంతాల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై, తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ లో సివరేజి ట్రీట్మెంట్ ప్లాంట్ లేకపోవడంతో హాస్పటల్ లోని వ్యర్థాలు అన్ని నాలాలో చేరి మురుగు నీరు ప్రవాహం సక్రమంగా జరగడం లేదని తెలిపారు. దాంతో మురుగు నీరు రోడ్లపై చేరి కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటికే ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ తో మాట్లాడి సివరేజి ప్లాంట్ నిర్మాణం కోసం 3.45కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని, ఐతే ఆ నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు బస్తీలలోకి చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మార్చరీ నుండి వస్తున్న దుర్వాసనను అరికట్టడం కోసం చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ కు సూచించారు.

అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది

రాష్ట్రంలో ఇలాంటి వ్యవహారంపై తొలిసారిగా సమాచారం

ఎల్బీనగర్ : అండాల సేకరణ రాకెట్పై సీపీ సుమతి కీలక వ్యాఖ్యలు చేసారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. తొలుత వ్యభిచార సంబంధిత రాకెట్గా భావించి విచారణ చేపట్టగా.. అండాల సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎగ్ డొనేషన్ వ్యవహారంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లు అనుమానాలున్నాయని అన్నారు. మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాలు సేకరించారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న హార్మోనల్ ఇంజెక్షన్లపై ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తు?న్నాం. బాధిత మహిళలకు ఇంజెక్షన్లు ఉపయోగించారా లేదా అనేది ఫోరెన్సిక్ నివేదికతో తేలనుంది. ఏఆర్టీ సెంటర్లు, ఫెర్టిలిటీ సెంటర్ల మధ్య వేర్వేరు బాధ్యతలు ఉంటాయి. ఏఆర్టీ సెంటర్ల ద్వారా బాధితులతో సంప్రదింపులు జరిపినట్లు విచారణలో తేలింది. రాష్ట్రంలో ఇలాంటి వ్యవహారంపై తొలిసారిగా సమాచారం అందడంతో పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించారు. తల్లి కావాలనుకునే వారు బిడ్డ ఆరోగ్యంపై ఆలోచిస్తున్నా.. అండం ఎలా సేకరిస్తున్నారనే అంశాన్ని పట్టించుకోవడం లేదని సీపీ వ్యాఖ్యనించారు. కేసులో అందరినీ నిందితులుగా పరిగణించలేమని స్పష్టం చేసారు. ఎవరి పాత్రకు సంబంధించి ఆధారాలు లభిస్తే వారినే నిందితులుగా గుర్తిస్తాం అని సీపీ బి. సుమతి వెల్లడించారు.

భూముల సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగాపూర్తిచేయాలి

మెదక్ : గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోజిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారి ఏ.డి కిషన్ ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ప్రక్రియపై లైసెన్స్ సర్వేయర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ పలు కీలక సూచనలు చేశారుప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి అవినీతికి తావులేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సర్వే మరియు హద్దుల గుర్తింపు (ఈ-ఒతినివ) దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, భూముల రీ-సర్వేలో అలసత్వం చూపినా లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరికరాలైన డీజీపీఎస్ (ఆఉఖూ), రోవర్లు మరియు టోటల్ స్టేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్..
మైక్రోసాఫ్ట్, గూగుల్ బాటలో మెటా!

ఫ్రాన్స్‌లో ఉద్యోగులకు మెటా స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం

సుమారు 100 మంది ఉద్యోగులపై ప్రభావం ఉండే అవకాశం

ఒక్కో ఏడాది సర్వీసుకు 2.15 నెలల జీతం ఆఫర్ చేసినట్లు కథనాలు

పది నెలల పాటు 80 శాతం వేతనంతో సెలవు అని సమాచారం

నైపుణ్య శిక్షణ, వ్యాపార ప్రారంభానికి సహకారం అందచే యోచనలో మెటా



ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్న వేళ.. మరో కొత్త పరిణామం చోటుచేసుకుంటోంది. ఉద్యోగులను నేరుగా తొలగించకుండా స్వచ్ఛందంగా సంస్థ నుంచి వైదొలిగే అవకాశాన్ని కల్పిస్తున్నాయి దిగ్గజ కంపెనీలు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ఈ విధానాన్ని అనుసరిస్తుండగా.. తాజాగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కూడా ఆ జాబితాలో చేరినట్లు సమాచారం. ఫ్రాన్స్‌లోని తమ ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని మెటా ప్రతిపాదించినట్లు ఫ్రెంచ్ మీడియా సంస్థ 'లా లెటర్' వెల్లడించింది. ఫ్రాన్స్‌లో మెటాకు ప్రస్తుతం సుమారు 300 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ పథకం అమలైతే దాదాపు 100 మంది వరకు సంస్థను వీడే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే ఏ విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడుతుందన్నది ఇంకా స్పష్టత రాలేదు.

మైక్రోసాఫ్ట్, గూగుల్ పథకాలకు భిన్నంగా మెటా ప్రతిపాదన ఉందని సమాచారం. ఫ్రాన్స్‌లోని కార్మిక చట్టాల ప్రకారం 'కలెక్టివ్ కాంట్రాక్చువల్ టెర్మినేషన్' (ఆర్‌సీసీ) విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో భాగంగా కంపెనీ, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటారు. ఈ పథకంలో చేరాలనుకునే ఉద్యోగులు నవంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది.

ఈ పథకం కింద ఉద్యోగులకు ఆకర్షణీయమైన పరిహారం అందించే ప్రతిపాదనను మెటా ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఉద్యోగి సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి 2.15 నెలల వేతనానికి సమానమైన మొత్తాన్ని చెల్లించనుంది. దీంతోపాటు పది నెలల పాటు మొబిలిటీ లీవ్ కల్పించి.. ఆ సమయంలో స్థూల వేతనంలో 80 శాతం చెల్లించేలా ప్రతిపాదించినట్లు కథనం పేర్కొంది. ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ, సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు కూడా సహకారం అందించే అంశాన్ని మెటా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

ఈ ప్రతిపాదనపై జులై నుంచి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఫ్రాన్స్‌లో మెటా గతంలోనూ ఇదే తరహా విధానాన్ని అనుసరించింది. 2023లో కుదిరిన ఒప్పందం ప్రకారం అప్పట్లో సుమారు 350 మంది ఉద్యోగులున్న సంస్థలో 88 మంది వైదొలిగే అవకాశం ఏర్పడింది.

ప్రపంచవ్యాప్తంగా మెటాలో సుమారు 66 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ప్రతిపాదించిన పథకాన్ని ఇతర దేశాల్లోనూ అమలు చేస్తుందా? అన్నది ఇంకా తెలియరాలేదు. మరోవైపు గూగుల్ ఐదు దేశాల్లో ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ అవకాశాలు కల్పించగా.. మైక్రోసాఫ్ట్ అమెరికా, కెనడా, భారత్, బ్రిటన్‌లోని 60 వేల మంది అర్హులైన ఉద్యోగుల కోసం బైఅవుట్ పథకాన్ని ప్రకటించింది.

మెటా కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా 8 వేల ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికను ప్రకటించింది. ఇది అప్పటి మొత్తం ఉద్యోగుల్లో 10 శాతానికి సమానం. మే నెలలో మరో 7 వేల మంది ఉద్యోగులను ఏఐకి సంబంధించిన విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఏఐ సాయంతో గతంలో పెద్ద బృందాలు చేయాల్సిన పనులను ఇప్పుడు ఒక్క ఉద్యోగే పూర్తి చేయగలుగుతున్నారని సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ గతంలో పేర్కొన్నారు. 2026లో డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా కేంద్రాల కోసం మెటా 135 నుంచి 145 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్న టెక్ దిగ్గజాలు.. అదే సమయంలో ఉద్యోగుల సంఖ్యను, పని విధానాలను పునర్వ్యవస్థీకరిస్తుండటం గమనార్హం.

ఏఐ ఖర్చులపై యాపిల్ కోత.. ఉద్యోగుల బడ్జెట్‌లో భారీ తగ్గింపు!

టెక్ దిగ్గజం యాపిల్ తన ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగంపై కేటాయించే రోజువారీ బడ్జెట్‌లో కోతలు విధిస్తోంది. సంస్థ ఖర్చుల నియంత్రణ చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏఐ వినియోగాన్ని ఒకవైపు ప్రోత్సహిస్తూనే, మరోవైపు దానివల్ల పెరుగుతున్న వ్యయాలను అదుపు చేసేందుకు యాపిల్ ఈ చర్యలు చేపట్టింది. 'బ్లూమ్‌బెర్గ్' కథనం ప్రకారం, గత నెలలో కొంతమంది ఇంజనీర్ల రోజువారీ ఏఐ వినియోగ పరిమితిని 300 డాలర్ల నుంచి 200 డాలర్లకు తగ్గించారు. కొన్ని ఇంజనీరింగ్ బృందాలకు ఈ పరిమితిని 100 డాలర్లకు తగ్గించే ఆలోచనలో యాజమాన్యం ఉన్నట్లు సమాచారం. ఇంజనీరింగేతర విభాగాలకు ఇప్పటికే 100 డాలర్ల పరిమితి ఉండగా, దానిని కొన్ని బృందాలకు 25 డాలర్లకు తగ్గించే ప్రతిపాదనలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే, తమ ప్రాజెక్టులకు అధిక పరిమితి అవసరమైన వారు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతి పొందవచ్చు. ఉద్యోగులు ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని, ఆంత్రోపిక్ క్లాడ్ వంటి ఏఐ మోడళ్లను ఉపయోగించినప్పుడు అయ్యే ఖర్చును 'టోకెన్ల' రూపంలో లెక్కిస్తారు. కోడింగ్, డీబగ్గింగ్ వంటి పనులకు ఎక్కువ టోకెన్లు అవసరం కావడంతో ఇంజనీర్లకు ఇప్పటివరకు అధిక బడ్జెట్ ఉండేది. ఈ నిర్ణయంపై కంపెనీలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న 300 డాలర్ల పరిమితిని చాలామంది ఉద్యోగులు పూర్తిగా ఉపయోగించుకోలేదని, కాబట్టి ఈ కోత సహజమేనని కొందరు భావిస్తున్నారు. అయితే, సెప్టెంబర్‌లో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జాన్ టర్నస్, సంస్థను తక్కువ



ఖర్చుతో నడపాలని భావిస్తున్నారని, ఈ చర్యలు అందులో భాగమేనని మరికొందరు విశ్లేషిస్తున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో యాపిల్ పరిశోధన, అభివృద్ధి ఖర్చులు 32 శాతానికి పెరగడానికి ఏఐ మౌలిక సదుపాయాల వ్యయం కూడా ఒక కారణం. ఏఐ ఖర్చులను నియంత్రించడం కేవలం యాపిల్‌కు మాత్రమే పరిమితం కాలేదు. గతంలో ఉద్యోగులను ఏఐ ప్రయోగాలకు విస్తృతంగా ప్రోత్సహించిన యాక్సెంచర్, మైక్రోసాఫ్ట్, మెటా, టెస్లా వంటి సంస్థలు కూడా ఇప్పుడు టోకెన్ ఖర్చులు పెరగడంతో అంతర్గత వినియోగంపై పరిమితులు విధిస్తున్నాయి. కాగా, ఈ నివేదికపై స్పందించేందుకు యాపిల్ ప్రతినిధి నిరాకరించారు.

బిజినెస్

దలాల్ స్ట్రీట్‌లో దివాళీ ధమాకా..
దూసుకెళ్తున్న స్టాక్‌మార్కెట్లు..
ఇన్వెస్టర్లకు 7 లక్షల కోట్ల బొనాంజా



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో ఇవాళ దివాళీ ధమాకా మొదలైంది. ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్లు రఫాడిస్తున్నాయి. సెన్సెక్స్ 1600 పాయింట్లతో దూసుకెళ్తోంది. ఇక నిఫ్టీ తన ట్రేడింగ్‌లో ఇవాళ ఉదయం రెండు శాతం లాభాలను చూపించింది. స్టాక్‌మార్కెట్ల జోష్‌తో ఇన్వెస్టర్ల సంపద పెరిగింది. సుమారు 7 లక్షల కోట్ల లాభాలు పెట్టుబడిదారులకు చేరినట్లు ట్రేడింగ్ ద్వార తెలుస్తోంది. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోలు శక్తి పెరిగినట్లు తెలిసింది. 30 షేర్ల బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో ఇవాళ 2.08 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం 1609.54 పాయింట్లు దూసుకెళ్లింది. ఇక నిఫ్టీ50 417.45 పాయింట్ల లాభాల్లో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ షేర్లు 1.74 శాతం వృద్ధి సాధించాయి. బుధవారం స్టాక్‌మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఆ జోరే ఇవాళ ఉదయం కూడా కొనసాగింది.

ట్రంప్ ఓటమితో స్టాక్‌మార్కెట్లకు జోష్..
సెన్సెక్స్ 2,100 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్లలో గురవారం లాభాల జోరు కొనసాగుతున్నది. అమెరికా ఎన్నికల ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలతో వరుసగా ఆరోరోజు కూడా సూచీలు లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ముఖ్యంగా ముడిచమురు ధరల పతనం మార్కెట్లకు మరింత ఉత్సాహాన్నిస్తున్నది. దాంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 2100 పాయింట్లకుపైగా ఎగబాకింది. నిఫ్టీ 24,500 మార్క్ పైన కదలాడుతున్నది. మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో సెన్సెక్స్ 2,124 పాయింట్లు పెరిగి 79,426 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 578 పాయింట్ల లాభంతో 24,538 వద్ద కొనసాగుతోంది. ఫార్మా మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ఉన్నాయి. ఆటోమొబైల్ రంగ సూచీ 2.5 శాతం ఎగబాకింది. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణిస్తున్నాయి. రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, కోల్ ఇండియా, ఎయిర్‌టెల్ స్వల్ప నష్టాల్లో ఉన్నాయి. అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలతో వాల్‌స్ట్రీట్ దూసుకెళ్లింది. డోజోన్స్ ఏకంగా 1500 పాయింట్లకుపైగా పెరుగగా ఎస్ అండ్ పీ 500 సూచీ 1.58 శాతం, నాస్‌డాక్ 1.44 శాతం ఎగబాకాయి. ఈ పరిణామాలు మన మార్కెట్లకు కలిసొచ్చాయి.

ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ ఒంటరిగా ఫీలయ్యాడా?
అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు

హార్దిక్ ముంబయిలో ఒంటరిగా ఫీలయ్యాడన్న రాయుడు

కెప్టెన్సీ వదిలి ఆటపై దృష్టి పెట్టాలని సూచన

ముంబయిలో కొనసాగితే ఆటగాడిగానే ఉండాలన్న అభిప్రాయం

జట్టు మారినా ఒక సీజన్ కెప్టెన్సీ వద్దని వ్యాఖ్య

పంజాబ్, చెన్నై జట్లు అతడికి మంచి ఎంపికలని వెల్లడి



ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ 2027కు ముందే చర్చ మొదలైంది. అతడు జట్టును వీడనున్నాడంటూ ట్రేడ్ వార్తలు వస్తున్న నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబయి జట్టులో హార్దిక్ తనను ఒంటరిని చేశారన్న భావనకు గురై ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అతడు మళ్లీ ముంబయి తరఫున ఆడాలనుకుంటే కెప్టెన్సీ బాధ్యతలు వదులుకుని ఆటపై దృష్టి పెట్టాలని సూచించాడు. క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న రాయుడు.. ముంబయిలో హార్దిక్ పరిస్థితి అంత బాలేదని వ్యాఖ్యానించాడు. జట్టులో తనను ఓ మూలకు నెట్టేసినట్టు ఓ ఆటగాడు భావిస్తే, ప్రతి విషయంలోనూ వెనక్కి చూసుకోవాల్సి వస్తుందని చెప్పాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పరిస్థితులు ఆట గాడి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ విషయంలో జరిగిన ప్రతిదానికీ అతడినే తప్పుబట్టలేమని, ఇతర కారణాలు కూడా ఉండొచ్చని పేర్కొన్నాడు. 2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చిన హార్దిక్‌కు ఫ్రాంచైజీ కెప్టెన్సీ అప్పగించింది. అప్పటివరకు జట్టుకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలోనూ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. హార్దిక్ నాయకత్వంలో మూడు సీజన్లలో ముంబయి ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరినట్లు రాయుడు ప్రస్తావించాడు. హార్దిక్ ముంబయిలోనే కొనసాగాలనుకుంటే కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగా ఆడాలని రాయుడు సూచించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదిస్తూ జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా మారడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు. ఒకవేళ ముంబయిని వీడితే కనీసం ఒక సీజన్ పాటు మరో జట్టులోనూ కెప్టెన్సీ చేపట్టకూడదని అభిప్రాయపడ్డాడు. ట్రేడ్ ద్వారా హార్దిక్ వెళ్లే అవకాశాలపైనా రాయుడు స్పందించాడు. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో అతడికి మంచి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నాడు. అక్కడ కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా తన ఆటపై దృష్టి పెట్టవచ్చని చెప్పాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం ప్రస్తుతం కెప్టెన్ అవసరంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నందున హార్దిక్‌కు అంత సులభమైన ఎంపిక కాదని విశ్లేషించాడు. హార్దిక్ పాండ్యా ముంబయి నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారే అవకాశాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అర్ష్‌దీప్ సింగ్‌తో ఆటగాళ్ల మార్పిడి ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ట్రేడ్‌పై ఆయా ఫ్రాంచైజీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

స్పోర్ట్స్

సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్..
సగం ధరకే లివింగ్‌స్టోన్ చెన్నై గూటికి!

ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండోలో భారీ డీల్

చెన్నై జట్టులోకి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్

రూ.13 కోట్ల లివింగ్‌స్టోన్‌ను సగం ధరకే సొంతం చేసుకున్న సీఎస్‌కే

పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న హైదరాబాద్ ఫ్రాంచైజీ



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగాని కన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్‌ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు. ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకోగా, కుల్దీప్ యాదవ్‌ను వదులుకుంది. అలాగే, ఢిల్లీ నుంచి టి. నటరాజన్ తిరిగి ఎస్‌ఆర్‌హెచ్‌లోకి రాగా, బదులుగా జీషాన్ అన్సారీ ఢిల్లీకి మారిన సంగతి తెలిసిందే.

సెంచరీలు కాదు.. 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్.. కోహ్లీ ఎంపిక వెనుక ఆసక్తికర కారణం




వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. ఈరోజు 38వ పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్స్‌లనూ పక్కనపెట్టాడు. అయితే చివరకు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్స్ ముందు వాటన్నింటినీ వెనక్కి నెట్టాడు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారత్ 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో కోహ్లీ 34 బంతుల్లో 43 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. జడేజా 33 పరుగులతో రాణించడంతో భారత్ 129 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 124 పరుగులకే పరిమితం చేసి ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్థాన్‌పై 2012 ఆసియా కప్‌లో చేసిన 183, దక్షిణాఫ్రికాపై 2015లో సాధించిన 138, 2015 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌లను కూడా కాదని కోహ్లీ ఎంచుకున్న ఇన్నింగ్స్ ఇది. భారీ వ్యక్తిగత స్కోర్ల కంటే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చేసిన కీలక పరుగులకే కోహ్లీ ఎక్కువ విలువ ఇస్తున్నాడని దీని ద్వారా స్పష్టమవుతోంది.



దక్షిణాది సినిమాలపై బాలీవుడ్ నటుల విమర్శలు సరికాదు: రెజీనా కసాండ్రా!

భారతీయ సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చ ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఈ ప్రాంతీయ చర్చకు మళ్లీ తెరలేపాయి. సౌత్ సినిమాపై ఉత్తరాది నటీనటులు చేసే విమర్శలను ఆమె తీవ్రంగా తప్పుబట్టడంతో పాటు, హిందీ చిత్రసీమలో తనకు ఎదురైన చేదు అనుభవాలు, ప్రాంతీయ వివక్షను బయటపెట్టారు. జాన్వీ కపూర్, రాధికా ఆప్టే వంటి బాలీవుడ్ నటులు ఇటీవల సౌత్ సినిమా ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలపై రెజీనా స్పందిస్తూ.. ఉత్తరాది నటులు దక్షిణాది సినిమాల గురించి ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల ఇండస్ట్రీల మధ్య అనవసరమైన విభేదాలు వస్తాయని అన్నారు. సౌత్ సినిమాలలో నిజంగానే సమస్యలు ఉన్నాయని భావిస్తే, ఆ ప్రాజెక్ట్‌లలో నటించకుండా వారు ముందే ఎందుకు బయటకు వచ్చి ఉండకూడదని సూటిగా ప్రశ్నించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, బాలీవుడ్‌లో తనకు ఎదురైన వివక్షను కూడా ఆమె పంచుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో తెరకెక్కిన భారీ చిత్రం 'కేసరి చాప్టర్ 2'లో తాను అక్షయ్ కుమార్ భార్యగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాత్రలో నటించినట్లు రెజీనా తెలిపారు. అయితే సినిమా ప్రమోషన్ల సమయానికి తన పట్ల జరిగిన తీరు తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలో కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్లలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తన పేరును తొలగించారని, తనపై వచ్చిన పాటను విడుదల చేసినా సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ చేయలేదని వాపోయారు. తాను సౌత్ ఇండియన్ నటి అనే కారణంతోనే తనపై ఈ వివక్ష చూపించారా అంటూ ఆమె బాలీవుడ్ తీరును నిలదీశారు.



'చంద్రయాన్' నుంచి 'చీఫ్ సైంటిస్ట్' శివ కుమార్ దీకొండ పాత్ర పరిచయం!

ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సమర్పణలో, 'సింబ స్క్రీన్ స్టోరీస్' పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మిస్తోన్న వైవిధ్యమైన చిత్రం 'చంద్రయాన్' (జష్టుఅఎతీఖిఎఖుఅ). గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ అడ్వెంచర్ కామెడీ సినిమా నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ చిత్రం విడుదలకు ఇంకా 8 రోజులే ఉండడంతో పాత్రలను పరిచయం చేస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా హీరోగా నటిస్తున్న శివ కుమార్ దీకొండ (ాష్టఅఱు ఖబఖితీ ఱష్టవవఎశీఅఱు) పాత్రను చిత్ర యూనిట్ అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేసింది. ఈ మిషన్ వెనుక ఉండే అసలు మాస్టర్ మైండ్ మరియు 'చీఫ్ సైంటిస్ట్' (జష్టఅవట ాఎఅవత్అఱ్) అంటూ శివకుమార్ దీకొండ లుక్‌తో కూడిన కొత్త ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. సమాజంలో తమని తక్కువ చేసి మాట్లాడిన వారి ముందు తమ ప్రతిభను నిరూపించుకోవాలని నలుగురు గ్రామీణ యువకులు గట్టిగా నిర్ణయించుకుంటారు. ఎవరికీ అంతుచిక్కని ఆలోచనగా సొంతంగా ఒక రాకెట్ తయారు చేసి, ఏకంగా చంద్రమండలానికి వెళ్లాలని వారు సాహసించడమే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ క్రమంలో మందమర్రి నుంచి చందమామ వరకు సాగే ఈ ప్రయాణం ఆద్యంతం నవ్వులు పూయించనుంది. శివ కుమార్ దీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, 'బలగం' సత్యనారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు

నయనతార 'మహాశక్తి'కి తెలుగులో గట్టి పరీక్ష.. పోటీగా 'రామాయణ', 'సీన్'!



దక్షిణాది లేడీ సూపర్‌స్టార్ నయనతార ఈ ఏడాది మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది పలు చిత్రాలతో సందడి చేసిన ఆమె.. ఇప్పుడు 'మూకుత్తి అమ్మన్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. తెలుగులో ఈ సినిమా 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ భక్తిరస ప్రధానమైన చిత్రంపై తమిళ ప్రేక్షకుల్లో కొంత ఆసక్తి కనిపిస్తున్నప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం విడుదలకు ముందు ఆశించిన స్థాయిలో సందడి కనిపించడం లేదు. నవంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన ఈ సినిమాలో నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఈసారి కథను మరింత భారీ స్థాయిలో, పౌరాణిక అంశాలు, దైవశక్తి నేపథ్యంలో తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. గతంలో వచ్చిన మొదటి భాగం భక్తితో పాటు వినోదం, సామాజిక అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంది. రెండో భాగానికి సుందర్ సి దర్శకత్వం వహించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సినిమాలో రెజీనా కసాండ్రా ప్రతినాయిక పాత్రలో నటిస్తున్నారు. కన్నడ నటుడు దునియా విజయ్, అజయ్ ఘోష్, ఊర్వశి, అభినయ, యోగి బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. భారీ తారాగణం, భక్తి నేపథ్యం, గ్రాఫిక్స్‌తో కూడిన దృశ్యాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర బృందం భావిస్తోంది. తమిళంలో నయనతారకు ఉన్న క్రేజ్‌తో 'మూకుత్తి అమ్మన్ 2'పై అంచనాలు ఉన్నాయి. కానీ తెలుగులో మాత్రం 'మహాశక్తి'కి విడుదలకు ముందు పెద్దగా ప్రచార హడావుడి కనిపించడం లేదు. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఆరంభాన్ని అందుకుంటుందనే ఆసక్తి నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్ర పంపిణీ బాధ్యతలను మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ చేపట్టింది. విడుదలకు ముందు ప్రచారం కంటే ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందనే సినిమాకు కీలకం కానుంది. నవంబర్ 6న 'మహాశక్తి'కి బాక్సాఫీస్ వద్ద పోటీ కూడా గట్టిగానే ఉండనుంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణ' థియేటర్లలో సందడి చేస్తుండగా, అదే రోజున సూర్య నటించిన 'సీన్' కూడా విడుదల కానుంది. ఈ రెండు సినిమాల మధ్య 'మహాశక్తి'కి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం సవాలుగా మారింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో ముందుగానే ఆసక్తి పెంచుకోలేకపోవడం సినిమాకు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

రణ్‌బీర్-సాయిపల్లవిల 'రామాయణ - 1' మెప్పించిందా?

రామాయణం రివ్యూ



సినిమా పేరు: రామాయణం
తారాగణం: రణబీర్‌కపూర్, సాయిపల్లవి, యశ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, రవి దూబే, వివేక్ ఒబెరాయ్, అరుణ్‌గోవిల్.
దర్శకత్వం: నితీశ్ తివారీ
నిర్మాత: నమిత్ మల్హోత్రా
సంగీతం: హన్స్ జిమ్మర్, ఏ.ఆర్.రెహమాన్

భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది నితీశ్ తివారీ 'రామాయణ'. ప్రకటన వచ్చిన నాటి నుంచే ఈసినిమాపై అంచనాలు మొదలయ్యాయి. రాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్, కైకసిగా శోభన, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్.. ఇలా తారాగణ వివరాలు తెలియగానే ఆ అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రచార చిత్రాలు సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఫస్ట్ పార్ట్ ఈ దీపావళికి, నెక్స్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి అని ప్రకటించగానే, తొలిపార్ట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూశారు. అనుకున్నట్టే 'రామాయణ -- 1' సినిమా గురువారం థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చింది. మరి అందరి అంచనాలనూ ఈ సినిమా అందుకున్నదా? ఈ సినిమాకు ముందు బాలీవుడ్‌లోనే తెరకెక్కిన 'రామాయణ' ఇతిహాసం 'ఆది పురుష్' ఆడియన్స్‌కి, నిర్మాతలకు చేదు అనుభవాలను మిగిల్చింది. మరి నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ 'రామాయణం' ప్రేక్షకుల ఎలాంటి అనుభూతినిచ్చింది? అనేది తెలుసుకునే ముందు కథలోకి వెళ్లాలి.

కథ

ఇది యుగయుగాలుగా భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయిన కథ. కాబట్టి రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది జగమెరిగిన కావ్యం. అయితే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందించారు కనుక, ఈ తొలి భాగం దశాననుడు రావణుడిగా మారిన పరిణామక్రమాన్ని, శ్రీరాముడి జన్మవృత్తాంతం, తాటక వధ, శివధనుర్భగం, సీతారామలక్ష్మణ వనవాసం, కబంధుని వధ, కరదూషణాధుల వధ, సీతాపహరణం, జటాయు మరణం ఘట్టాలతో సాగింది. జాటాయు మరణానంతరం 'రావణుడ్ని సంహరించబోతున్నాను' అంటూ రాముడు ప్రతిజ్ఞ చేయడంతో ఈ తొలి భాగం ముగిసింది. ఇక సుందరకాండ, రావణ వధ, శ్రీరామపట్టాభిషేకం తదితర అంశాలన్నీ రెండో పార్ట్‌లో ఉంటాయన్నమాట.

విశ్లేషణ

దేవదానవ సంగ్రామంలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకొని పాతాళలోకంలో తలదాచుకున్న రాక్షస జాతికి పునరుజ్జీవాన్ని అందించేందుకు దానవరాణి కైకసి, తన తనయుడు దశాననుడిలోని పౌరషాగ్నిని రగిల్చడం, ఘోర తపస్సు చేసి, బ్రహ్మ దేవుడి వరాన్ని పొందిన దశాననుడు దానవసామ్రాట్టు రావణబ్రహ్మగా లంకా రాజ్య సింహాసన్నా అధిష్టించడంతో కథ మొదలైంది. ప్రతినాయకుడి శక్తిసామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించి, కథానాయ కుడు సాధించబోయే కార్యం ఎంత కష్టతరమైనదో ప్రేక్షకు లకు వివరించడంలో ముందు దర్శకుడు నితీశ్ తివారీ సక్సెస్ అయ్యారు. నిజానికి రావణుడి పాత్రకు ఆయనిచ్చిన ఎలివేషన్స్ రాముడికి కూడా ఇవ్వలేదు. నిజానికి రాముడికి ఎలివేషన్ అవసరం లేదు కూడా. రావణుడనేవాడు ఎంతటి మహావీరుడైనా, శక్తివంతుడైనా చివరకు వాడు పోయేది రాముడి చేతిలోనే అని ఆడియన్స్‌కి తెలుసు కాబట్టి, ఎలివేషన్స్ అవసరం లేదనుకుని ఉండొచ్చు. సాదాసీదాగా రాముడి పాత్రను కథలోకి ప్రవేశింపజేసి, నిదానంగా ఆడియన్స్‌కి 'శ్రీరాముడు' అనే వ్యాక్సిన్‌ని ఆడియన్స్‌కి ఇంజెక్ట్ చేశాడు దర్శకుడు నితీశ్. సినిమా చూడంగ చూడంగ.. రణబీర్‌లో రాముడ్ని చూడటం మొదలుపెట్టారు ఆడియన్స్. రణబీర్ కూడా అభినయం విషయంలో అద్భుతం అనిపించాడు. అయితే.. అతని ఆహార్యం బావున్నా.. నీలమేఘశ్యాముడిగా రాముడ్ని చూపించకపోవడం తెలుగువారికి మింగుడు పడదు. అందుకే.. రణబీర్‌ని రాముడిగా ఒప్పుకోవడానికి కాస్తంత టైమ్ పడుతుంది. నిజానికి 'రామాయణం'లోని బాలకాండ, అరణ్యకాండ కాస్త స్లోగా అనిపిస్తాయి. కానీ దర్శకుడు నితీశ్ తివారీ ఎక్కడా జనానికి విసుగు అనిపించకుండా, తొలి పావుగంట రావణాసుడి ఎపిసోడ్ తో, తర్వాత తాటక వధ, కంబధ వధ, కరదూషణాదుల వధ, జటాయు మరణం.. లాంటి అద్భుతమైన యుద్ధ సన్ని వేశాలను హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించి, ఎక్కడా ల్యాగ్ అనిపించకుండా ఆసక్తికరంగా, అందరికీ నచ్చేలా తీసి, సక్సెస్ అయ్యారు. అయితే.. ఇప్పటివరకూ రావణమాత కైకసి పాత్రను పాజిటీవ్‌గానే మనం చూశాం.కానీ ఈ సినిమాలో కైకసి నుంచి రావణుడ్ని విష్ణుద్వేషం మొదలైనట్టు చూపించారు. అలాగే.. శ్రీరాముడి ముందు భార్గవరాముడు మోకరిల్లడం లాంటి సీన్స్ కూడా జనానికి మింగుడు పడవు. అయితే.. మిగతా సన్నివేశాలన్నీ జనరంజకంగా తెరకెక్కించారు. మొత్తంగా తొలిభాగంతోనే దర్శకుడు నితీశ్ జనాల్లో మంచి మార్కులు సంపాదించుకున్నారు.

నటీనటులు

రాముడిగా రణబీర్ చక్కగా అభినయించాడు. పరశు రాముడిగా కూడా ఓ సన్నివేశంలో కనిపించి అదరహో అనిపించుకున్నారు. ఇక సీతగా సాయిపల్లవి ఒదిగిపోయి నటించింది. ఆమె ఆహార్యం, అభినయం నిజంగా అద్భుతం. ఇందులో సీతను కూడా ఓ యోధురాలిగా చూపించి, ఓ కొత్త ప్రయోగానికి తెరలేపారు దర్శకుడు నితీశ్. రామాయణాన్ని నిశితంగా గమనించిన వారికి, అలా చూపించడం తప్పు కాదు అనిపిస్తుంది. ఎందుకంటే.. మహావీరులు, మహాబలులు సైతం ఎత్తలేని శివధనుస్సును అలవోకగా ఎత్తిన మహాబలశాలి సీతామ్మ. అలాంటి సీతమ్మ యోధురాలు ఎందుకు కాకూడదు?. మొత్తంగా సాయిపల్లవి సీతగా చాలా బాగా నటించింది. సీతాసాధ్విగా, వీరనారిగా పలు కోణాలను ఆమె పలికించిన తీరు బావుంది. లక్ష్మణుడిగా రవి దూబే కూడా బావున్నాడు. ఇక రావణుడిగా యశ్ అయితే.. విశ్వరూపం చూపించాడు. శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్‌సింగ్ నటన ఓ గౌరవాన్ని తెచ్చింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలకు న్యాయం చేశారు.

సాంకేతికంగా

సాంకేతికంగా అన్ని విభాగాలూ బాగా పనిచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ఉపయోగించి దబ్బింగ్ విషయంలో, అచ్చంగా తెలుగు సినిమాను చూస్తున్న అనుభూతినే తీసుకురాగలిగారు. లిప్ సింక్ కూడా సరిగ్గా సరిపోయింది. కెమెరా పనితనం బావుంది. ఏఆర్ రెహమాన్ పాటలు, నేపథ్య సంగీతం భావగర్భితంగా, కథ స్థాయికి తగ్గట్టుగా సాగింది. యాక్షన్ అంశాలను కూడా అద్భుతంగా తెరకెక్కించారు. సీజీ వర్క్ అయితే.. నేచురల్‌గా అనిపించింది. మొత్తంగా నిర్మాత పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. రావణాడ్ని సంహరిస్తానని రాముడు చెప్పడంతో ప్రథమార్థం ముగిసింది. సెకండ్‌పార్ట్‌లో ఆంజనేయుడు రాబోతున్నాడని హింట్ ఇస్తూ.. ఆంజనేయుడి బిట్స్‌ని చూపించి, సముద్రాన్ని లంఖిస్తున్న మారుతిగా సన్నీడియోల్‌ని వెనకనుంచి చూపించడం ఆడియన్స్‌కి గూస్‌బంప్స్ తెప్పించాయి. హనుమాన్‌చాలీసా వస్తుండగా టైటిల్స్ దిగుతుంటే.. ఆంజనేయుడి ఆగమానం గుర్తొచ్చి జనం భావోద్వేగానికి లోనయ్యారు.

చివరిగా ఇంటిల్లిపాదీ కలిసి చూడాల్సిన సినిమా 'రామాయణం'.

బలాలు

కథనం, నటీనటుల నటన, సాంకేతికత..

బలహీనతలు

పాత్రలకు విరుద్ధంగా అనిపించిన కొన్ని సన్నివేశాలు

రేటింగ్ 3/5

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,